ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 134 | గురువారం 12 ఫిబ్రవరి 2026 | పేజీలు - 8 వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati



# అసెంబ్లీలో దూకుడుకి సర్కార్ వ్యూహం

- గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలకు శ్రీకారం..
- ప్రసంగం మధ్యలోనే వైసీపీ వాకౌట్..
- 14 వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం..
- శాఖల వారీగా ఎనిమిది రోజుల పాటు పద్దులపై సుదీర్ఘ చర్చ..
- ఆరు ఆర్డినెన్స్‌లకు సభ ఆమోదం పొందే దిశగా చర్యలు..
- రుషికొండ, మెడికల్ కాలేజీల సహా వివాదస్పద అంశాలూ చర్చకు..
- చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలను గవర్నర్ తన ప్రసంగంలో విపులంగా వివరించారు. అయితే గవర్నర్ ప్రసంగం జరుగుతుండగానే వైసీపీ సభ్యులు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేసి, అనంతరం సభ నుంచి వాకౌట్ చేయడం సభా వాతావరణాన్ని వేడెక్కించింది. అధికార పక్షం మాత్రం తన అజెండాపై స్పష్టతతో ముందుకు సాగుతోంది.గవర్నర్ ప్రసంగం అనంతరం సమావేశమైన బిజినెస్ అడ్వైజరీ కమిటీ అసెంబ్లీ సమావేశాల వ్యవధి, చర్చల ప్రణాళిక, అజెండాపై కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈసారి సమావేశాలను మొత్తం 17 రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించగా, ప్రతి అంశంపైనా సమగ్ర చర్చకు సమయం కేటాయించాలని భావించారు. ఈ నెల 14న 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఆదాయ వనరులు, వ్యయ ప్రణాళికలు, సంక్షేమానికి కేటాయింపులు, అభివృద్ధి రంగాలకు ప్రాధాన్యత వంటి అంశాలపై ఈ బడ్జెట్ దిశానిర్దేశకంగా ఉండనుంది.బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం 15, 16 తేదీల్లో శివరాత్రి సందర్భంగా, తదుపరి రోజు సాధారణ సెలవు ప్రకటించారు. 17, 18 తేదీల్లో బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగనుండగా, 18న ఆర్థిక మంత్రి సభలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వనున్నారు. అనంతరం వరుసగా ఎనిమిది రోజుల పాటు శాఖల వారీగా బడ్జెట్ పద్దులపై విస్తృతంగా చర్చించేందుకు నిర్ణయించారు. ప్రతి శాఖకు కేటాయించిన నిధులు, అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల అమలు విధానం వంటి అంశాలను సభలో స్పష్టంగా వివరించనున్నారు.ఈ సమావేశాల్లో ప్రభుత్వం ఆరు ఆర్డినెన్స్‌లకు ఆమోదం పొందే దిశగా ముందుకు సాగనుంది. పరిపాలనలో వేగం తీసుకురావడం, విధాన పరమైన మార్పులు అమలు చేయడం లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ ఆర్డినెన్స్‌లపై సభలో చర్చ జరిగే మిగతా 2లో

# వైసీపీ నిరసన

## గవర్నర్ ప్రసంగం మధ్యలోనే వైసీపీ వాకౌట్



- శాంతి భద్రతలపై జోరుగా నినాదాలు..
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై తీవ్ర అభ్యంతరం..
- లడ్డూ అంశంపై అసత్య ప్రచారం అంటూ ఎద్దేవా..
- పార్టీ నేతల ఇళ్ల దాడులపై హెచ్చరిక..
- బడ్జెట్ సమావేశాల వ్యూహంపై జగన్ సమీక్ష..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలి రోజే రాజకీయ ఉద్రిక్తతలు చెలరేగాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసెంబ్లీ వద్ద ప్రభుత్వ వ్యతిరేక నిరసనకు దిగారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి సభా ప్రాంగణానికి చేరుకున్న ఆయన చేతిలో ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రతిపక్ష పార్టీగా మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.గవర్నర్ ప్రసంగం ప్రారంభం కాగానే వైసీపీ సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శాంతి భద్రతలు కాపాడాలని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని, ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ అంశంపై అసత్య ప్రచారం జరుగుతోందంటూ సభలో ప్లకార్డులు ప్రదర్శించారు. గవర్నర్ పోడియంను వైసీపీ సభ్యులు చుట్టుముట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మార్షల్స్ సభలోకి ప్రవేశించి పరిస్థితిని నియంత్రించారు.(మిగతా 2లో)

# జగన్‌తో దువ్వాడ భేటీ

- రాజకీయ భవిష్యత్‌పై స్పష్టత కోరిన ఎమ్మెల్సీ...
- అసెంబ్లీ లాబీలో ఆప్యాయ సంభాషణ..
- ధర్మాన సోదరులతో విబేధాల ప్రస్తావన..
- పార్టీలోకి తీసుకోకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తా..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

ఏపీలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్న పరిణామం చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైఎస్సార్సీపీ బహిష్కృత ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అకస్మాత్తుగా (మిగతా 2లో)

# సభకు వస్తేనే హాజరు

- అసెంబ్లీలో ఏఐ ఆధారిత నమోదు విధానం..
- సంతకాల రిజిస్టర్ రద్దు..
- ఫేస్ రికగ్నేషన్ నమోదుకు శ్రీకారం..
- నో వర్క్, నో పే సూచనల నేపథ్యంలో స్పీకర్ నిర్ణయం..

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**



అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ రోజు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభ మయ్యాయి. రాజకీయంగా కీలకంగా భావిస్తున్న ఈ సమావేశాలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ సహా వైసీపీ సభ్యులు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగం అనంతరం బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశమై సభా కార్యక్రమాల అజెండాను ఖరారు చేయనుంది. ఈ నెల 14న 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది.సమావేశాల ప్రారంభంతోనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు కీలక (మిగతా 2లో)

# సరదా నిరసనలు వద్దు

- సమస్యలపై చర్చిద్దాం అసెంబ్లీకి రండి..
- బడ్జెట్ సమావేశాలకు అందరూ హాజరైతే బాగుంటుంది..
- అవినీతి అంశాలపై చర్చిద్దాం..
- ప్రజల మేలే కూటమి లక్ష్యం..
- పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ...



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

ప్రజల సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి వైసీపీ ఎమ్మెల్యేలకు హితవు పలికారు. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు బుధవారం హాజరైన ఆమె, ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం రాష్ట్ర అభివృద్ధి, అమరావతి రాజధాని పురోగతి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై స్పష్టమైన దిశానిర్దేశం ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా (మిగతా 2లో)

# 24 అజెండా అంశాలకు ఆమోదం

- నీటి పారుదలశాఖలో 7,189 నిర్వహణ పనులకు అనుమతి..
- గాజువాక పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ..
- తిరుపతిలో డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై.. 24 అజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలిపింది. నీటి పారుదలశాఖలో 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. భూముల బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును 30-06-2026 వరకు పొడిగించేందుకు క్యాబినెట్ ఆమోదించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కీసరపల్లి గ్రామంలోని సర్వే నం.29/8లోని 3.84 ఎకరాల భూమిని కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం' కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లాలో 1500 ఎకరాల భూమిని 250 మెగావాట్ల సౌర (మిగతా 2లో)

# అంబటిని వీడని కేసులు

- బెయిల్.. వెంటనే పీటీ వారెంట్..
- చంద్రబాబు వ్యాఖ్యల కేసుల్లో హైకోర్టు ఊరట..
- పీపీపీ ఆందోళన కేసులోనూ బెయిల్..
- సత్తెనపల్లి సంక్రాంతి లక్కీడ్రా కేసు తెరపైకి..
- రాజమండ్రి జైలు నుంచి కస్టడీకి సిద్ధమైన పోలీసులు..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

ఏపీలో అధికార కూటమి, విపక్ష వైఎస్సార్సీపీ మధ్య లడ్డూ నెయ్యి కల్తీ అంశంపై నెలకొన్న రాజకీయ వేడిలో మాజీ మంత్రి అంబటి రాంబాబుకు వరుస పరిణామాలు ఎదురవుతున్నాయి. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో నమోదైన కేసుల్లో ఆయన జైలుపాలైన విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 36 కేసులు నమోదు కాగా, వాటిలో గుంటూరులోని నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో కోర్టు ఆయనను రిమాండ్‌కు పంపింది. అయితే మిగతా కేసులను హైకోర్టు తోసిపుచ్చడంతో అంబటికి భారీ ఊరట లభించింది.దీంతో ఆయన త్వరలోనే విడుదలవుతారని భావిస్తున్న సమయంలో మరో కేసు ఆయనను చుట్టుముట్టింది. మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన ఆందోళనకు సంబంధించి నమోదైన కేసులో కూడా పోలీసులు చర్యలు చేపట్టి ఆయనను జైలులోనే కొనసాగించారు. అయితే ఆ కేసులోనూ ఇవాళ అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరైంది. దీంతో రేపటికి ఆయన జైలు (మిగతా 2లో)

# గ్రూప్ 1 మూల్యాంకనంపై సిట్ దర్యాప్తుకు ఆదేశం

- ఫోరెన్సిక్ పరీక్షలు తప్పనిసరి..
- ఎంపికైన వారికి తాత్కాలిక నియామకాలు మాత్రమే..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా, ఆ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం సంచలన ఆదేశాలు జారీ చేసింది. మూల్యాంకన ప్రక్రియలో లోపాలు ఉన్నాయన్న ఆరోపణలను సీరియస్‌గా పరిగణించిన (మిగతా 2లో)

# ఆర్టీసి ప్రైవేటీకరణపై ఈయూ కఠిన హెచ్చరిక

- ప్రైవేటీకరణ వెనక్కి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన..
- భారత్ బందుకు ఆర్టీసి కార్మికుల మద్దతు..



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

ఏపీలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా విద్యుత్ బస్సులు, ఆర్టీసీ డిపోల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలపై ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ గుర్తింపు ఉద్యోగ సంఘం ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ప్రభుత్వం తక్షణమే ప్రైవేటీకరణ నిర్ణయాలను విరమించుకోవాలని కీలక హెచ్చరికలు జారీ చేసింది. విద్యుత్ బస్సుల పేరుతో సంస్థను ప్రైవేటీకరించే ప్రయత్నాలు ఆపాలని, పూణేకు చెందిన పినకల్ కంపెనీకి 11 ఆర్టీసీ డిపోలు కేటాయించిన నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని ఈయూ నేతలు డిమాండ్ చేశారు.విద్యుత్, సి.ఎన్.జీ, డీజిల్ బస్సులు అన్నీ ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ విధానం సంస్థకు (మిగతా 2లో)

# అసెంబ్లీలో దూకుడుకి సర్కార్ వ్యూహం



(మొదటి పేజి (తరువాయి)

అవకాశం ఉంది. అలాగే ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన రుషికొండ అభివృద్ధి, మెడికల్ కాలేజీల స్థాపన, ఇతర ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులపై కూడా సభలో చర్చ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు, ప్రతిపక్షం లేవనెత్తుతున్న ఆరోపణలకు అసెంబ్లీ వేదికగా సమగ్ర సమాధానం ఇవ్వాలని అధికార పక్షం వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై గణాంకాలతో సహా వివరాలు వెల్లడించేందుకు సిద్ధమవుతోంది. దీంతో ఈసారి సమావేశాలు కేవలం బడ్జెట్ పరిమితిలో కాకుండా రాజకీయ పరంగా కూడా కీలకంగా మారనున్నాయి.
ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించాలనే నిర్ణయం బీఏసీలో తీసుకోవడం విశేషం. మార్చి 1, 2, 3 తేదీల్లో సెలవు ప్రకటించారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సభ నిర్వహించనుండగా, తప్పనిసరిగా ఉదయం 10 గంటలకు జీరో అవర్ నిర్వహించాలని నిర్ణయించారు. అవసరమైతే సమావేశాల సమయాన్ని పొడిగించేందుకు కూడా అంగీకారం తెలిపారు.
మార్చి 6న సమావేశాల ముగింపు సందర్భంగా అమరావతిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలనే నిర్ణయం స్పీకర్ తీసుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి దిశగా తీసుకున్న చర్యలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయడమే ఈ సమావేశాల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. రాజకీయంగా వేడెక్కే అవకాశాల మధ్య ఈసారి అసెంబ్లీ సమావేశాలు రాష్ట్ర రాజకీయాలకు కొత్త మలుపు తిప్పేలా ఉండనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## గ్రూప్ 1 మూల్యాంకనంపై

# సిట్ దర్యాప్తుకు ఆదేశం

(మొదటి పేజి (తరువాయి)

న్యాయస్థానం, అదనపు డీజీ స్థాయి అధికారితో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మార్చి 16లోపు దర్యాప్తు పూర్తి చేసి నివేదికను హైకోర్టుకు సమర్పించాలని స్పష్టమైన గడువు విధించింది.ఈ కేసు దర్యాప్తులో పారదర్శకత కోసం ఏపీకి చెందిన వారు కాకుండా ఇతర రాష్ట్రాల ఫోరెన్సిక్ నిపుణుల సేవలు వినియోగించాలని కూడా కోర్టు సూచించింది. అభ్యర్థులు రాసిన సమాధాన పత్రాల భద్రతపై అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో, ఆ జవాబు పత్రాలు సురక్షితంగా ఉన్నాయా లేదా అన్న విషయంపై ఏపీపీఎస్సీని ప్రశ్నించింది. సమాధాన పత్రాల భద్రతను నిర్ధారించడంతో పాటు, ఎలాంటి మార్పులు లేదా ట్యాంపరింగ్ జరిగిందా లేదా అన్నది ఫోరెన్సిక్ పరీక్షల ద్వారా తేల్చాలని ఆదేశించింది.ఎంపికైన అభ్యర్థుల సమాధాన పత్రాలు చెక్కుచెదరకుండా ఉన్నాయా, ఏదైనా రూపంలో మార్పులు జరిగాయా అన్నది సిట్ ప్రత్యేకంగా పరిశీలించాలి అని పేర్కొంది. విజయవాడలో భౌతిక మూల్యాంకనం సమయంలో ఉపయోగించిన పత్రాలపై ఉన్న బార్‌కోడ్‌లు, ఒరిజినల్ ఓఎంఆర్ షీట్‌లు, బార్‌కోడ్‌ల నుంచి పొందిన డేటా ఎంపికైన అభ్యర్థుల వివరాలతో సరిపోతున్నాయా లేదా అనేది సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించింది. ఎంపికైన అభ్యర్థుల సమాధాన పత్రాలు, రిట్ పిటిషన్లలో పార్టీలుగా ఉన్న ఎంపిక కాని అభ్యర్థుల సమాధాన పత్రాల మూల్యాంకనం ఒకే విధానంలో జరిగిందా లేదా అన్నది కూడా తేల్చాలని సూచించింది. అలాగే మొదటి 100 లోపు ర్యాంకులు సాధించిన అభ్యర్థుల సమాధాన పత్రాలు, మెరిట్ జాబితాలో చివరి అభ్యర్థి తరువాత తక్కువ ర్యాంకు పొందిన అభ్యర్థుల పత్రాల మూల్యాంకనం ఒకే ప్రమాణాలతో జరిగిందా లేదా అన్న అంశాన్ని కూడా సిట్ పరిశీలించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి నివేదిక అందే వరకు తదుపరి ఆదేశాలు ఇచ్చే దాకా ఎంపికైన అభ్యర్థులందరినీ నాన్-ఫోకల్ పోస్టుల్లో మాత్రమే నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు తాజా ఆదేశాలతో గ్రూప్--1 నియామకాల ప్రక్రియపై మరింత అనిశ్చితి నెలకొంది. ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసి ఫోరెన్సిక్ సాయంతో సమాధాన పత్రాలపై వచ్చిన ఆరోపణలను నిర్ధారించాల్సిన బాధ్యత ఏర్పడింది. ఈ దర్యాప్తు నివేదిక ఆధారంగా భవిష్యత్తులో కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఆర్టీసి ప్రైవేటీకరణపై ఈయూ కఠిన హెచ్చరిక




(మొదటి పేజి (తరువాయి)

దీర్ఘకాలికంగా నష్టం కలిగిస్తుందని ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ హెచ్చరించారు. విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి డిపోలను ప్రైవేటుకు అప్పగించడం అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ బస్సులకు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం స్వయంగా కల్పించాలని, విద్యుత్ బస్సులకు తమకు వ్యతిరేకత లేదని కానీ వాటి నిర్వహణ ఆర్టీసీ ద్వారానే జరగాలని ఆయన స్పష్టం చేశారు.ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ఈయూ హెచ్చరించింది. మరోవైపు కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా రేపు నిర్వహించనున్న భారత్ బంద్‌కు ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటించాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 129 ఆర్టీసీ డిపోలు, 4 వర్క్‌షాపుల్లో ఎర్ర బ్యాడ్జీలతో విధులకు హాజరై గేట్ మీటింగ్స్ నిర్వహించాలని ఈయూ పిలుపునిచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ గేట్ మీటింగ్స్ చేపట్టనున్నట్లు వెల్లడించింది.నాలుగు కార్మిక కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రైవేటీకరణ-ఔట్‌సోర్సింగ్ విధానాలను నిలిపివేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కనీస పెన్షన్‌ను రూ.10 వేలుకు పెంచాలని, స్త్రీశక్తి పథకం అమలుతో ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరాయి. అదేవిధంగా ఆర్టీసీలో 3 వేల కొత్త బస్సులు ప్రవేశపెట్టి, 10 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని ఈయూ డిమాండ్ చేసింది.

# ముంబై మేయర్‌గా రితూ తావ్డే

## ఏకగ్రీవంగా ఎన్నికైన బిజెపి కార్పొరేటర్

**ముంబాయి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

ముంబయి మేయర్‌గా మహాయుతికి చెందిన రితూ తావ్డే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత 25 ఏళ్లలో భాజపాకు ఈ పదవి దక్కడం ఇదే తొలిసారి. స్థానికంగా భాజపా సీనియర్ నేత అయిన రితూ .. ఘట్కోపర్ వెస్ట్ నుంచి మూడుసార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ విద్యా కమిటీ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఆమెకు ఉంది. వార్డు స్థాయిలో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. కాగా, 227 సీట్ల బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 89 సీట్లు భాజపా గెలుచుకోగా శిందే సేన 29 స్థానాల్లో విజయం సాధించింది.



# వైసీపీ నిరసన



(మొదటి పేజి (తరువాయి)

అనంతరం గవర్నర్ ప్రసంగం కొనసాగుతుండగానే వైసీపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.
తరువాత పార్టీ నేతలతో జగన్ సమావేశమై భవిష్యత్ వ్యూహంపై చర్చించారు. తమ పార్టీ నేతల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయని, ఇదే విధంగా కొనసాగితే సహించేది లేదని హెచ్చరించినట్లు సమాచారం. సభకు వెళ్లదలచిన ఎమ్మెల్యేలు వెళ్లవచ్చని సూచించారని తెలిసింది. అయితే మండలిలో మాత్రం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, పార్టీ నేతల ఇళ్లపై దాడులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.గవర్నర్ ప్రసంగం అనంతరం బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం జరగనుంది. సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలి, అజెండా ఏంటి అనే అంశాలపై నిర్ణయం తీసుకోనుంది. బీఏసీకి వైసీపీ దూరంగా ఉండే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం దాదాపు ఇరవై రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. లడ్డూ వివాదం, మెడికల్ కాలేజీల అంశాలపై సభలో విస్తృత చర్చ నిర్వహించి ప్రజలకు వివరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. సమావేశాలు సుదీర్ఘంగా కొనసాగే సూచనలు ఉండటంతో పార్టీ ఎమ్మెల్యేల సమావేశంలో జగన్ తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# అసెంబ్లీకి సబ్జెక్టుపై అవగాహనతో రావాలి



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. సమస్యలను చర్చించి సిద్ధంగా ఉండాలన్నారు. సబ్జక్ట్‌పై ప్రిపేర్ రావాలని అన్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా కూటమి నేతల ఐక్యత కొనసాగుతోందని చెప్పారు. కింది స్థాయిలోనూ ఇదే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల నేతలు సమావేశాలు పెట్టుకుంటూ ఐక్యత పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరుపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మాట్లాడతా. 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతా. ఆవు కథలు చెప్పడం మాని స్జబెక్ట్ ప్రిపేర్ అయి సభకు రావాలి. ఎవరేం మాట్లాడుతున్నారో నేనూ నోట్ చేసుకుంటా అని అన్నారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఉండాలి. నేను కూడా రోజూ ఉదయం 11 గంటల నుంచి సెషన్ అయ్యే వరకూ అసెంబ్లీలో ఉంటా. సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. అక్కడ ఏం మాట్లాడినా వారి కోసమేనని గ్రహించాలి. అనుకున్న విషయాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు జరుగుతున్న లబ్ధిని ఎప్పటికప్పుడు చెప్పాలి. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90వేల కోట్లకు పైగా రైల్వే పనులు జరుగుతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.450 కోట్ల నష్టంలో ఉంది. నష్టాలను అధిగమించి రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శుభపరిణామం. కేంద్ర ప్రాయోజికత కార్యక్రమాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. అన్ని మతాలను గౌరవించాలి.. భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయ కూడదు. జగన్‌కు మతాలపై గౌరవం లేనందునే వైకాపా హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. తిరుమల శ్రీవారి లడ్డూతో పాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారు‘ అని చంద్రబాబు అన్నారు.

# అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

**వాణిజ్య ఒప్పందంతో అమెరికాకే లాభం.. ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో అనిల్ అంబానీ, హర్దీప్ పురిల ప్రస్తావప బడ్జెట్ చర్చలో రాహుల్ విమర్శలు ....రాహుల్ వ్యాఖ్యలపై గందరగోళం**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించిందని రాహుల్ గాంధీ అన్నారు.మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీ పేరు వచ్చినా.. ఎందుకు జైలులో పెట్టలేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యాపారవేత్త అనీల్ అంబానీ ఎందుకు జైలులో లేడని నేను అడగాలనుకుంటున్నాను? దీనికి కారణం ఆయన పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉంది. అతన్ని (అనీల్ అంబానీ) ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసిన హర్‌దీప్ పూరిని కూడా నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. అతన్ని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. హర్దీప్ పూరికి అతన్ని ఎవరు పరిచేశారో తెలుసు’ అని అన్నారు. పరోక్షంగా రాహుల్ మోడీనుద్దేశించి వ్యాఖ్యానించారు. బ్జడెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బ్జడెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

# జగన్‌తో దువ్వాడ భేటీ

(మొదటి పేజి (తరువాయి)

అసెంబ్లీకి హాజరై పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలవడం చర్చనీయాంశమైంది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజున గవర్నర్ ప్రసంగానికి హాజరైన జగన్, వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనంతరం సభను వీడి బయటకు వస్తుండగా లాబీలో దువ్వాడను ప్రత్యేకంగా పిలిపించారు. జగన్‌ను కలిసిన దువ్వాడ ఆయన కాళ్లకు నమస్కరించగా, ఇద్దరూ కలిసి బయటకు నడుచుకుంటూ వెళ్తూ కాసేపు మాట్లాడుకున్నారు.ఈ సందర్భంగా “ఏం చేద్దామనుకుంటున్నావ్ శ్రీనివాస్?” అంటూ జగన్ ఆప్యాయంగా ప్రశ్నించగా, దువ్వాడ తన జిల్లాలో ధర్మాన సోదరులతో నెలకొన్న విభేదాలను ప్రస్తావించినట్లు తెలిసింది. వారి కారణంగానే తనపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారని, ఇందులో తన తప్పేమీ లేదని వివరించినట్లు సమాచారం. దువ్వాడ చెప్పిన విషయాలను శ్రద్ధగా విన్న జగన్, తరువాత వ్యక్తిగతంగా వచ్చి కలవాలని సూచించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.అనంతరం అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడిన దువ్వాడ శ్రీనివాస్ తన రాజకీయ భవిష్యత్‌పై స్పష్టత ఇచ్చారు. పార్టీ అధినేత తిరిగి పార్టీలోకి తీసుకుని వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని స్పష్టం చేశారు. తన బలం ఏంటో నిరూపిస్తానని వ్యాఖ్యానించారు. అప్పటివరకు మండలిలో ప్రజా సమస్యలపై తన వాణిని బలంగా వినిపిస్తానని తెలిపారు. త్వరలోనే జగన్‌ను వ్యక్తిగతంగా కలిసి అన్ని విషయాలు వివరించనున్నట్లు వెల్లడించారు.తిరుమల లడ్డూ వ్యవహారంపై స్పందించిన దువ్వాడ, ఈ అంశంలో తాను భక్తుల వైపు నుంచే మాట్లాడతానని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పీపీపీ విధానంలో చేపట్టాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే నేరుగా బాధ్యతలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. దువ్వాడ-జగన్ భేటీతో వైఎస్సార్సీపీలో అంతర్గత రాజకీయాలపై మరోసారి చర్చ మొదలైంది. శ్రీకాకుళం రాజకీయాల్లో ఈ పరిణామం ఎలా మలుపుతీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది.

# సభకు వస్తేనే హాజరు

(మొదటి పేజి (తరువాయి)

నిర్ణయం అమలు చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల నుంచే సభ్యుల హాజరును కృత్రిమ మేధ ఆధారిత డిజిటల్ విధానంలో నమోదు చేయనున్నారు. ఇకపై సాంప్రదాయ సంతకాల రిజిస్టర్ ఉండదని, సభ్యులు ప్రత్యేకంగా సంతకం చేయాల్సిన అవసరం లేదని అసెంబ్లీ వర్గాలు స్పష్టం చేశాయి. సభలో తమకు కేటాయించిన సీటులో కూర్చున్న తర్వాతే సంబంధిత సభ్యుడి హాజరు నమోదు అయ్యేలా వ్యవస్థను రూపొందించారు.ఇటీవల సభకు రాకుండానే బయట రిజిస్టర్‌లో సంతకాలు చేసి జీతభత్యాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన శాసనసభ స్పీకర్ల అఖిల భారత మహాసభలో కూడా అసెంబ్లీకి రాని సభ్యులకు ‘నో వర్క్--నో పే’ విధానం అమలు చేయాలని స్పీకర్ సూచించిన విషయం తెలిసిందే. అవసరమైతే ప్రజాప్రతినిధులను వెనక్కి పిలిపించే విధానంపై కూడా చర్చ జరగాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు.సభలో పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేసి ముఖ గుర్తింపు సాంకేతికతను వినియోగిస్తున్నారు. సభ్యులు ఎంతసేపు సభలో ఉన్నారనే వివరాలు కూడా డిజిటల్ విధానం ద్వారా నమోదు కానున్నాయి. దీంతో ఆలస్యంగా వచ్చి సమావేశాలు ముగియకముందే వెళ్లిపోవడం వంటి పరిస్థితులకు చెక్ పడనుంది. సాంకేతికత ఆధారంగా పారదర్శకత పెంపు దిశగా తీసుకున్న ఈ నిర్ణయం బడ్జెట్ సమావేశాల ప్రారంభ వేళ విశేష ఆసక్తి రేకెత్తిస్తోంది.

# సరదా నిరసనలు వద్దు

(మొదటి పేజి (తరువాయి)

ముందుకు సాగుతోందని అన్నారు.అసెంబ్లీ లాబీలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి నియోజకవర్గ అభివృద్ధి, ఐటీ రంగ విస్తరణ, విద్యా సదుపాయాల మెరుగుదలపై చర్చించినట్లు తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడంపై సానుకూల స్పందన లభించిందని వెల్లడించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైసీపీ ఎమ్మెల్యేలు బడ్జెట్ సమావేశాల మొదటి రోజే అసెంబ్లీకి వచ్చి నిరసన తెలియజేసి వెళ్లిపోవడం బాధ్యతారాహిత్యంగా కనిపిస్తోందన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధులుగా తమ నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించి పరిష్కారం కోరాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ అంశం, గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి విషయాలపై సభలోనే చర్చించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.ప్రజాస్వామ్య వేదికైన అసెంబ్లీని నిరసనలకే పరిమితం చేయకుండా, నిర్మాణాత్మక చర్చలకు ఉపయోగించాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె స్పష్టం చేశారు.

# 24 అజెండా అంశాలకు ఆమోదం

(మొదటి పేజి (తరువాయి)

విద్యుత్ ప్రాజెక్ట్ కోసం కేటాయించనున్నారు. ఎకరాకు ఏటా రూ.31,000 లీజ్ చెల్లించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇకపోతే అసెంబ్లీకి సంబంధించిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాలనలో క్రమశిక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై సీఎం స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రుల పనితీరు, ప్రవర్తనపై ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. మంత్రులందరూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా అసెంబ్లీలో ఉండాలని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత తమ పేషీల్లో ఉండి ఎమ్మెల్యేల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అసెంబ్లీలో ’ఆవు కథలు’ చెప్పవద్దని, సమాధానాలు క్లుప్తంగా, అర్థమయ్యేలా ఉండాలని మంత్రులకు చెప్పారు. మాట్లాడే ప్రతి మాట బాధ్యతగా ఉండాలని హెచ్చరించారు.

# అంబటిని వీడని కేసులు

(మొదటి పేజి (తరువాయి)

నుంచి బయటకు వస్తారని అనుచరులు ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ ఇదే సమయంలో సత్తెనపల్లి పోలీసులు మరో కేసును ముందుకు తెచ్చారు. 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో వసూళ్లకు పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా నమోదైన కేసులో విచారణకు అనుమతించాలని కోరుతూ గుంటూరు కోర్టులో పీటీ వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆ పిటిషన్‌ను అనుమతిస్తూ పీటీ వారెంట్ జారీ చేసింది.ఈ పరిణామాల నేపథ్యంలో రేపు సత్తెనపల్లి పోలీసులు రాజమండ్రి జైలు నుంచి అంబటి రాంబాబును తమ అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. 2023లో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో వసూళ్లు జరిగినట్లు జనసేన నేతలు అప్పట్లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు అదే ఏడాది కేసు నమోదైంది. ప్రస్తుతం ఆ కేసులో దర్యాప్తు పేరుతో అంబటిని కస్టడీలోకి తీసుకునేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో అంబటి రాంబాబుకు వరుసగా లభిస్తున్న బెయిల్‌ల మధ్య కొత్త కేసులు తెరపైకి రావడం రాష్ట్ర రాజకీయాల్లో మరింత చర్చనీయాంశంగా మారింది.



మహాశివరాత్రి బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

# మహాశివరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

శ్రీ శివ బాలయోగి మహారాజ్ ఆశ్రమవంలో మహాశివరాత్రి ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అనంతపురంనగరంలో మొట్టమొదటి సారిగా శ్రీశ్రీశ్రీ శివ బాలయోగి మహారాజ్ ఆశ్రమంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శతరుద్ర మహా యాగం 28 హోమ కుండాలతో 108 మంది దంపతులతో ఉదయం 6-30 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు . సాయంత్రం యమపూజలు సాయంత్రం 6 గంటలకు, రాత్రి 9, అర్ధరాత్రి 12 (లింగోద్భవ కాలం) 16 వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు. ఉంటాయన్నారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఆకర్షణగా సహస్ర లింగం, 6 అడుగుల అమర్‌నాథ్ మంచులింగం, రాత్రి 10-30 నుండి శ్రీ అనంతేశ్వర మహాలింగానికి భక్తుల స్వహస్తములతో అఖండ భస్మాభిషేకం (విభూది) నిర్వహిస్తామన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రెసిడెంట్ జూటూరు అరవింద్ , వైస్ ప్రెసిడెంట్ రత్నగిరి దేవరాజు , సెక్రెటరీ కలవల మల్లికార్జున , ట్రెజరర్ చిందలూరు ప్రసాద్, లక్ష్మీనారాయణ విశ్వనాథం శెట్టి, జూటూరు మహేష్ బాబు పాల్గొన్నారు.

### బీజేపీ ఓబీసీ మోర్చా సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్‌గా

# యల్లన్నగారి రామాంజనేయులు నియామకం

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్‌గా యల్లన్నగారి రామాంజనేయులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ యల్లన్నగారి రామాంజనేయులు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తూ, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూన్నానని తెలిపారు.



భారతీయ జనతా పార్టీలో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రాష్ట్ర, జిల్లా పార్టీ సూచనల మేరకు అనేక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించానని వెల్లడించారు. ప్రభాస్ యోజనలో భాగంగా మూడు రోజులపాటు అనంతపురం జిల్లాలోని ద్వారక మండలంలో పర్యటించి మండల కమిటీలు, బూత్ కమిటీలు ఏర్పాటు చేసి సమీక్షా సమావేశాలు నిర్వహించామని తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ 52 స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్ నిర్వహించడం జరిగిందన్నారు. బీసీ చైతన్య సభల సందర్భంగా ఆదోని, విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నానని, ఎన్నికల సమయంలో పార్టీ ఆదేశాల మేరకు నెల రోజులపాటు ఆదోనిలో ఉండి క్లస్టర్-4 బాధ్యతలు స్వీకరించి సమర్థవంతంగా పనిచేశానని తెలిపారు. రాష్ట్ర, జిల్లా నాయకత్వం సూచనల మేరకు పలు కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బీజేపీ ఓబీసీ మోర్చా సత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యత అప్పగించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ కి, సంఘటన మంత్రివర్యులు మధుకర్ జీకి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రంగాల గోపి శ్రీనివాస్ కి, ధర్మవరం శాసనసభ్యులు, రాష్ట్ర వైద్యశాఖ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ కి, ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి. సావిత్రికి, సత్యసాయి జిల్లా అధ్యక్షులు జి.ఎం. శేఖర్ స్వామికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. భారతీయ జనతా పార్టీ అభివృద్ధి, బూత్ స్థాయి బలోపేతం, కార్యకర్తల సమన్వయం ప్రధాన లక్ష్యాలుగా తీసుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.



ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రంగాల గోపి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న యల్లన్నగారి రామాంజనేయులు



మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్‌కు మెమెంటో అందజేస్తున్న యల్లన్నగారి రామాంజనేయులు



అన్నదానం చేస్తున్న దృశ్యం

# విద్యార్థులకు అన్నదానం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 10:**

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్. డా.ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో విద్యార్థులకు బుధవారం అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు సాయి వర్షిని పుట్టినరోజు సందర్భంగా ఆమె తండ్రి జనార్దన్ రెడ్డి, తల్లి సునీత, నాయనమ్మ లక్ష్మీనారాయణమ్మ, తాత ఆదినారాయణ రెడ్డి ఈ అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించారు. విద్యార్థులకు అన్నదానంతో పాటు ఒక బియ్యం ప్యాకెట్, బిస్కెట్లు, చాక్లెట్లు ఇచ్చారు. అలాగే అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఉన్నదాంట్లో విద్యార్థులు సర్దుకుపోయే మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. చదువుకు మించిన సంపద లేదన్న విషయాన్ని గ్రహించి ప్రతి ఒక్కరూ చదువులో రాణించాలన్నారు. మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని, సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు శ్రీ స్వామి సత్యాత్మానంద, చక్రపాణి , ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఇంటి వద్ద వ్యర్థాల వర్గీకరణ ప్రాముఖ్యతపై అవగాహన

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

బెళుగుప్ప మండలం పరిధిలోని తగ్గుపర్తి గ్రామంలో బుధవారం సుజ్‌లాన్ ఫౌండేషన్ మద్దతుతో, సాహస్ సంస్థ అమలు చేస్తున్న బెళుగుప్ప ప్రగతి పథం ప్రాజెక్ట్ కింద రైతు భరోసా కేంద్రంలో సామర్థ్యాన్ని పెంపొందించే సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మౌనిక, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు వెంకట నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాహస్ నాగేష్, అమరేష్ మాట్లాడుతూ ప్రజలకు ఇంటి వద్ద వ్యర్థాల వర్గీకరణ (తడి మరియు పొడి) ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, వ్యర్థాలను పంచాయతీ వాహనానికి అప్పగించాలని సూచించారు. వేస్ట్ సేగిరిగేషన్ గేమ్ మరియు తడి చెత్త మరియు పొడి చెత్త గురెంచి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది.కార్యక్రమంలో తడి మరియు పొడి వ్యర్థాలను విడిగా సేకరించడం వల్ల తడి వ్యర్థాలు కంపోస్టింగ్ ద్వారా ఎరువుగా ఉపయోగపడతాయి, పొడి వ్యర్థాలు రీసైక్లింగ్ ద్వారా పునర్వినియోగం చేయవచ్చని వివరించారు. అలాగే మిశ్రమ వ్యర్థాలను ఇవ్వడం వల్ల రోడ్డు పక్కన చెత్త కుప్పలు ఏర్పడి దుర్వాసన వస్తుందని దోమలు, ఈగలు, ఎలుకలు వంటి పీడకాలు పెరిగి సంక్రమణ వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. పర్యావరణ కాలుష్యం మరియు భూగర్భజల కలుషితం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. శుభ్రమైన ఆరోగ్యకరమైన మరియు పచ్చని తగ్గుపర్తి దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచింది. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, మహిళా పొదుపు సంఘాల సభ్యులు, గ్రీన్ అంబాసిడర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు







సుజిలాన్ -సాహస్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సాహస సిబ్బంది నాగేష్, అమరేష్

## శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో ద్వజారోహణం, చిత్రగోపురసేవలు

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

పెన్నా నది పరివాహక ప్రాంతంలో వెలిసిన శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలొ భాగంగా బుధవారం రెండవ రోజున ఆలయ అర్చకులు ద్వజారోహణ, చిత్రగోపురసేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా అగ్నిమథనం, మహాగణపతి హోమం చేపట్టారు. అనంతరం స్వామి వారికి అలంకరణ గావించి, విశేష పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



మహాగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం





ధ్వజారోహణం చేస్తున్న దృశ్యం
ప్రత్యేక అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

# అగ్నికి అహుతి అయిన అరటితోట

## పరిశీలించిన రైతు సంఘం నాయకులు ..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

పెద్దవడుగూరు మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన రైతు ప్రభాకర్ రెడ్డి అరటి తోట కు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. పక్కనే ఉన్న కొండకు పెట్టిన నిప్పు ప్రమాదవశాత్తు ప్రభాకర్ రెడ్డి తోటకు అంటుకుంది. దీంతో రైతు నష్టపోయారని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు వెంకట రాముడు యాదవ్ కోరారు. తగులబడిన తోటను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా రైతుసంఘము ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్ మాట్లాడుతూ నిప్పు పెట్టడంతో రైతు తోటలోని డ్రిప్ ఇరిగేషన్ స్ప్రింకర్లు వ్యవసాయ పైపులు పరికరాలు కాలి బూడిదయ్యాయన్నారు. దీంతో బాధిత రైతుకు దాదాపు 10 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన పండ్లతోటలకు ప్రత్యేకనిధిని ఏర్పాటుచేసి తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుని తరపున రైతు సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అదినారాయణ, రంగస్వామి, అదిరంగారెడ్డి, ఉశేన్ పీరా, రంగనాయకులు, అల్లాబకాష్, నాగేంద్ర, శేషగోపాల్ ,రామాంజినేయులు, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో అగ్నికి ఆహుతి అయిన రైతు ప్రభాకర్ రెడ్డి అరటి తోటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు



తిమ్మాపురంలో అగ్నికి ఆహుతి అయిన రైతు ప్రభాకర్ రెడ్డి అరటి తోటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

# టిడిపిలో చేరిన మైనారిటీ నేత మున్నా

## జేసీ ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టం.. మైనారిటీ నేత హిరాపురం గయాజ్ బాషా ..

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వదిలి, తెలుగుదేశం పార్టీలోకి వైకాపా అనంతపురం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు హిరాపురం గయాజ్ బాషా (మున్నా) చేరాడు. తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, మైనారిటీ నాయకులు హిరాపురం గయాజ్ బాషా (మున్నా)కు తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా హిరాపురం గయాజ్ బాషా (మున్నా). మాట్లాడుతూ నాయకుడిగా కొంత పేరు వచ్చిందని, కొంత డబ్బు వచ్చిందని, నాయకత్వాన్ని దాటిపోవాలని ప్రయత్నించే నాయకులు ఉంటారని, అది వారి మూర్ఖత్వమని, అలాంటి నాయకుల ఆలోచనలు ప్రజలకు నష్టమే కలిగిస్తాయని, మన లక్ష్యం, వ్యక్తిగత ఎదుగుదల కాదని, ప్రజల అభివృద్ధియని, మన తాడిపత్రికి సేవ చేస్తున్న జేసీ ప్రభాకర్ రెడ్డి నాయకత్వాన్ని కాపాడుకోవడం కార్యకర్తలుగా మన ధ్యేయమని, అదే మన కర్తవ్యమని పేర్కొన్నారు. తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డి చేస్తున్న సింహాగర్జన వెనక మూడు అర్థాలు ఉన్నాయన్నారు.

రాజకీయాల్లోకి వచ్చిన తానకు సింహాగర్జన అనే పదం వినగానే మూడు ముఖ్యమైన అర్థాలు గుర్తుకు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ ఉండాలని,మన జీవితాలలో మార్పు రావాలంటే, మన ఊరి అభివృద్ధి సక్రమంగా జరగాలంటే డిసిప్లిన్ తప్పనిసరియన్నారు. నాయకత్వంలో క్రమశిక్షణ ఉంటేనే ప్రజలలో నమ్మకం పెరుగుతుందన్నారు. అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరగాలి. ప్రతి వర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి. అభివృద్ధి ఒక్కరికే కాకుండా అందరికీ అందాలని, అందుకే అభివృద్ధి అనే మాటను కేవలం మాటల్లో కాకుండా కార్యాచరణలో చూపించే నాయకత్వం మనకందరికి అవసరమన్నారు.



మున్నాకు టీడీపీ కండువా కప్పిన జేసీ ప్రభాకర్ రెడ్డి

ప్రతి సామాజిక వర్గం సురక్షితంగా ఉండాలని, తాడిపత్రిలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉండడం మన బలమన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణం కొనసాగడం కూడా మంచి నాయకత్వం వల్లే సాధ్యమైందన్నారు. తాడిపత్రిలో అన్ని వర్గాలు కలిసుండాలని, అభివృద్ధి జరగాలని, క్రమశిక్షణ కలిగి ఉండాలనేదిజే సీ ఫ్యామిలీ ఐడియాలజీయని, అదే సింహాగర్జన స్ఫూర్తియన్నారు. మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి నాయకత్వం తాడిపత్రిలో మాత్రమే కాదని, రాష్ట్ర స్థాయిలో కూడా ఒక ప్రభావం చూపిస్తోందని, ఆ గర్జన రాష్ట్ర నాయకులను కూడా అలర్ట్ చేసే స్థాయిలో ఉందన్నారు. శాసనసభ్యులు జేసీ అష్మిత్ రెడ్డిలో కూడా ఆ దూకుడు, దిశ, నిర్దేశం కనిపిస్తోందని, ఈ జనరేషన్‌ను దృష్టిలో పెట్టుకుని ముందుకు తీసుకెళ్లే ఆలోచన స్పష్టంగా ఉందన్నారు.

ముస్లిం సోదరుల అభివృద్ధి కోసం అనేక చర్యలు తీసుకుంటున్నారని తాను గమనిస్తున్నానని, త్వరలో గర్వంగా మా ముస్లిం సోదరుల ముందు నిలబడి మంచి వార్త చెప్పే అవకాశం వస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు. అందుకే తాను జేసీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో, జేసీ ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో రాజకీయంగా పని చేసే అవకాశం దక్కడం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. త్వరలోనే అధికారికంగా తెలుగుదేశం పార్టీలోకి చేరబోతున్నానని తెలిపారు. అనంతరం మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మున్నాను పార్టీలోకి రావాలని ఆహ్వానించలేదని, తాడిపత్రి అభివృద్ధిలో భాగస్వామి కావాలని, పార్టీలకు అతీతంగా సమాజానికి సేవ చేయాలనే దృక్పథంతో ఉన్న మున్నా లోని సేవతాప్పరతను గమనించి ఆహ్వానించాలని జేసీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గాయ భాష చాలా నిజాయితీపరులని ముక్కు సూటిగా ఉంటారని, ప్రజల సమస్యలను గుర్తించి వారితో మమేకమై వారి సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు హిరాపురం నియాజ్ బాషా, మునిసిపల్ వైస్ ఛైర్మన్ షేక్షావలి, మాజీ వైఎస్ చైర్మన్ అబ్దుల్ రహమాన్, కౌన్సిలర్లు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ శ్రేణులలో మున్నా

# లాలప్ప కాలనీలో మురికినీటితో అపరిశుభ్రత

## మురికి కాలువ శుభం చేయాలని డిప్యూటీ ఎంపీటీవోకు వినతి పత్రం .. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాతుకుంట బాలు..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**

యాడికి గ్రామంలోని లాలప్ప కాలనీలో మురికి కాలువ మరమ్మతులు చేసి పరిశుభ్రపరచాలని కోరుతూ డిప్యూటీ ఎంపీటీవో శశికళకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. యాడికి మండల కేంద్రం లోని లాలప్ప కాలనీలో ఎల్ఐసి రమణ ఇంటిదగ్గర మురికి కాలువ తగ్గుబడిపోయి కాలవలో నీరు అంతా రోడ్డుపైకి వస్తుంది. కావున కాల్వ కొద్దిగా ఎత్తు పెంచి మరమ్మతులు చేయవలసిందిగా అధికారులకు తెలిపారు అలాగే. గౌతమి స్కూల్ దగ్గర కూడా ఇదే పరిస్థితి ఉంది. కాలువ నిండిపోయి రోడ్డు పైకి నీరు వచ్చి ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఇక్కడ ఉన్న శివాలయంలో నుంచి వచ్చే నీరు రోడ్డు పైకి వస్తుంది. ఈ నీరుకు ఒక పైపు అమర్చి నీరు రోడ్డుపై రాకుండా కాలువ ఎత్తు పెంచి మరమ్మతులు చేయవలసిందిగా కోరారు. కాలువల శుభ్రపరిచిన తర్వాత ఆ చెత్తను తొందరగా ఎత్తివేయాలని లేదంటే ఆ చెత్త మరీ కాలువలో పడి నిండిపోతుంది వీటిని దృష్టిలో పెట్టుకొని మరమ్మతులు చేయవలసిందిగా కోరారు.

పై సమస్యలను పరిగణలోకి తీసుకొని తక్షణమే పురస్కరించవలసిందిగా కోరుతూ డిప్యూటీ ఎంపీటీవో శశికళకు ఎమ్మార్పీఎస్ నాయకులు వినత పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు, అధికార ప్రతినిధి చిటికెల చిరంజీవి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ ఎంపీటీవో శశికళకు వినతిపత్రం ఇస్తున్న ఎంఆర్పిఎస్ నాయకులు





యాడికిలోని ఎల్ఐసి రమణ ఇంటి వద్ద రోడ్డుపై నిలిచిన మురికి నీరు.
గౌతమి స్కూల్ వద్ద కాలువ నుండి రోడ్డుపై పారుతున్న మురికి నీరు



పండిత్ దీనదయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బిజెపి నేతలు

# దీనదయాళ్ ఆశయ సాధనే నిజమైన నివాళి

**బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కోటి సుధా..**

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కోటి సుధా,బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి భాస్కర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని సమర్పణ దివస్గా నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, దీనదయాళ్ ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం సిద్ధాంతం సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నదని తెలిపారు. సమాజంలోని చివరి వ్యక్తికీ అభివృద్ధి ఫలాలు అందాలన్నదే ఆయన ప్రధాన ఆశయమని పేర్కొన్నారు.ఆత్మనిర్భర భారత్ సాధనలో ఆయన ఆలోచనలు మార్గదర్శకమని, సమతుల్య మానవ వికాసం, సామాజిక న్యాయం, సేవాభావం వంటి విలువలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి కోటి సుధా, బీజేపీ మండల కన్వీనర్ ఆకులేటి భాస్కర్, బీజేపీ మాజీ అసెంబ్లీ కన్వీనర్ కావేటి మల్లికార్జున, బీజేవైఎం నాయకులు కప్పల సుదర్శన్, మండల ఉపాధ్యక్షులు వడ్డే తిరుపతయ్య, సాకే గోపాల్, ఆకులేటి తరుణ్, మాతంగి బాబు, ప్రవీణ్, నాగభూషణ, పోతలయ్య, పాముల విశ్వ, పెద్దయ్య, చందుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# గ్రామస్థాయి నుండే పార్టీ అభివృద్ధికి కృషి

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
వైయస్ఆర్సీపీ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడానికి ఐక్యమత్యంతో కృషి చేయాలని మండల కన్వీనర్ త్రిలోక్నాథ్ మరియు ఎంపీపీ ఈరన్న కోరారు. సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమలాపురం మండలం తముడేపల్లి పంచాయతీలో సర్పంచ్ గిరిజమ్మ సదానంద గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీల ఎంపికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో చురుకుగా ఉన్న వ్యక్తులను పార్టీ కోసం పని చేయడానికి కమిటీలో స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. కమిటీలో స్థానం పొందిన వారు కూటమి ప్రభుత్వం చేస్తున్న వాటిని ప్రజలకు వివరించాలన్నారు. రాబోవు 2029 సంవత్సరంలో వైయస్సార్ జగన్ న్నను ముఖ్యమంత్రి చేసుకోవడానికి కష్టపడి పని చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నారాయణ, కుంచితిగా ఒక్కలిగా డైరెక్టర్ వీరకేతరాయ, తాలూకా బీసీ సెల్ అధ్యక్షులు శివకుమార్, మండల యూత్ నాయకులు చంద్రశేఖర్ యాదవ్, సీనియర్ నాయకులు అనిల్ కుమార్, ఈర లింగప్ప, ఎంజే రప్ప, వెంకటస్వామి, ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు



సమావేశానికి హాజరైన వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు

# అక్షర ఆంధ్రపై శిక్షణ

**ఎంపీడీవో రామారావు..**

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
అమరాపురం భారతి గ్రామీక సంఘం ఆవరణలో మహిళా సంఘాల సభ్యులకు అక్షర ఆంధ్రపై శిక్షణ కార్యక్రమం ఏపీఎం ముత్యాలప్ప, ఎంపీడీవో రామారావు ఆధ్వర్యంలో ప్రారంభమైనది. ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువు నేర్చుకోవాలని అక్షర జ్ఞానం కలిగి ఉంటే మోసాలను అరికట్టవచ్చుని చిన్న చిన్న పదాలు, కూడికలు, ఏ విధంగా చేయాలి, రాబోవు రోజుల్లో ప్రతి ఒక్కటి ఆన్లైన్ వ్యవస్థ వచ్చి డిజిటలైజేషన్ ప్రక్రియతో మీరు తీసుకుంటున్న అన్ని లోన్లు కూడా యాప్ ల ద్వారా కట్టే అవసరం ఉంటుందని కాబట్టి దానికి కూడా విద్య నేర్చుకొనే అవకాశం ఉందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివో ఏలు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు



సంఘం సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

## మెగా లోక్ అదాలత్ విజయానికి

# అన్ని శాఖల సమన్వయం అవసరం

**అదనపు జిల్లా జడ్జి శైలజ..**

**హిందూపురం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
పోలీసు శాఖ, న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేస్తే జాతీయ మెగా లోక్ అదాలత్ను విజయవంతంగా నిర్వహించవచ్చని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ తెలిపారు. బుధవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి మార్చి 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో రాజీకి సిద్ధంగా ఉన్న కేసుల సంఖ్య, మార్చి 14 నాటికి పరిష్కరించగలిగే కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఉన్నత న్యాయస్థానం నిర్దేశించిన సివిల్, భరణం, రోడ్డు ప్రమాదాలు, బ్యాంకులు, మున్సిపాలిటీ, బిఎస్ఎన్ఎల్ తదితర శాఖలకు సంబంధించిన రాజీ కాదగ్గ కేసులను గుర్తించి వేగంగా పరిష్కరించాలన్నారు. రాజీ సాధ్యమైన క్రిమినల్ కేసులను కూడా లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించవచ్చని సూచించారు.
ప్రధానంగా సివిల్ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు ప్రత్యేక చొరవ చూపాలని, ప్రజలకు లోక్ అదాలత్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని కోరారు. కోర్టు వ్యవస్థపై ఉన్న భారం తగ్గించడంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని న్యాయాధికారులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీపీలు గోపాలకృష్ణ, నగేష్, సీఐలు రాజగోపాల్ నాయుడు, జనార్ధన్, అబ్దుల్ కరీం, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్ సింహారెడ్డి, ఆంజనేయులు, అశోక్లతో పాటు ఆయా న్యాయస్థానాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి శైలజ

# శెనగ రైతులను ఆదుకోవాలి

**దిగుమతులు నియంత్రించాలి..**
**శ్రీ సత్య సాయి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి..**



**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
శనగ రైతులు అధిక దిగుబడులు, విదేశాల నుంచి కొనసాగుతున్న దిగుమతుల కారణంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని అగ్రి అడ్వైజరీ బోర్డు శ్రీ సత్యసాయి జిల్లా మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి అన్నారు. మాజీ అగ్రి మిషన్ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ నాగిరెడ్డి సూచన మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లా తరఫున కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్కు వినతిపత్రం పంపినట్లు తెలిపారు. శనగ రైతులను తక్షణం ఆదుకునే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం సుమారు 11 నుండి 12 మిలియన్ టన్నుల శనగ ఉత్పత్తి అవుతుందని, దేశీయ అవసరం 10 నుండి 10.50 మిలియన్ టన్నుల మధ్యలోనే ఉంటుందని ఆవుటాల రమణారెడ్డి వివరించారు. ప్రపంచ ఉత్పత్తిలో 70 శాతం కంటే ఎక్కువ మన దేశంలోనే ఉత్పత్తి అవుతోందని, దేశ అవసరాలకు సరిపడా ఉత్పత్తి ఉన్నప్పటికీ విదేశాల నుంచి దిగుమతులు కొనసాగడం రైతులకు అన్యాయం చేస్తున్నదని అన్నారు. గతంలో అమలులో ఉన్న వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి పన్ను , సామాజిక సంక్షేమ సుంకం తగ్గించడంతో ప్రస్తుతానికి కాబూలీ శనగపై సుంకం సుమారు 30 శాతం, దేశీ శనగపై సుంకం 50 శాతం వరకు తగ్గిందని పేర్కొన్నారు.
2023-24లో 1.64 లక్షల టన్నులుగా ఉన్న ఉత్పత్తి 2024--25లో 15.06 లక్షల టన్నులకు పెరగడంతో మార్కెట్లో అధిక సరఫరా ఏర్పడి ధరలు కనీస మద్దతు ధర కంటే దిగజారిపోయాయని తెలిపారు. దీని వల్ల రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
ఆంధ్రప్రదేశ్లో అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, వైఎస్సార్ కడప, నంద్యాల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో సగటున 3.7 లక్షల హెక్టార్లలో శనగ సాగు జరుగుతుందని, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో దాదాపు 50 వేల హెక్టార్లలో పండిస్తున్నారని చెప్పారు. తాడిపత్రి, ఉరవకొండ, గుత్తి, కళ్యాణదుర్గం, పెనుకొండ ప్రాంతాల్లో నల్లరేగడి భూముల్లో ఎక్కువగా సాగు జరుగుతోందన్నారు.
గత ఏడాది ఉత్పత్తి చేసిన లక్షల టన్నుల శనగలు ఇంకా శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉండగా, అప్పుల ఒత్తిడితో రైతులు తక్కువ ధరలకు విక్రయించాల్సి వచ్చిన పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. దేశీయ ఉత్పత్తి పెరగడం, దిగుమతులు కొనసాగడం వల్ల ధరలు మరింత పడిపోయే ప్రమాదం ఉందని, ఇది రాష్ట్రం మరియు దేశవ్యాప్తంగా శనగ రైతులకు తీవ్ర దెబ్బ అవుతుందని హెచ్చరించారు. వరుస నష్టాల కారణంగా రైతులు ఇతర పంటల వైపు మళ్లే అవకాశముందని, ఇది పప్పుధాన్యాల్లో స్వయం సమృద్ధి లక్ష్యాలకు విరుద్ధమని అన్నారు.
ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని 2021 నుంచి 2023 మధ్య అమలులో ఉన్న విధంగా వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి పన్ను మరియు సామాజిక సంక్షేమ సుంకాన్ని మళ్లీ విధించాలన్నారు లేదా వాటికి సమానంగా ప్రాథమిక దిగుమతి సుంకాన్ని పెంచాలని కోరారు. అలాగే ప్రస్తుత సీజన్లో శనగ ఉత్పత్తికి ప్రతి క్వింటాల్కు వెయ్యి రూపాయల బోనస్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్లోని శనగ రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆవుటాల రమణారెడ్డి కోరారు.

# ప్రభుత్వ పథకాల లబ్ధికి ఏపీఎఫ్ఆర్ గుర్తింపు సంఖ్య కీలకం

**ప్రభుత్వ పథకాల కోసం రైతులు నమోదు చేసుకోవాలి..**
**మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్..**

**నల్లమాడ (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
నల్లమాడ మండలంలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల పథకాల లబ్ధి సక్రమంగా అందాలంటే 11 అంకెలతో కూడిన ఏపీఎఫ్ఆర్ గుర్తింపు సంఖ్య అత్యంత ముఖ్యమని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఏపీ ఎఫ్ ఆర్ ప్రాధాన్యతను విపులంగా వివరించారు. ఏపీ ఎఫ్ ఆర్ ద్వారా ప్రతి రైతు భూమి వివరాలు, పంట వివరాలు, సాగు విస్తీర్ణం, వ్యక్తిగత సమాచారం ప్రభుత్వ రికార్డుల్లో ఒకేచోట నమోదు అవుతాయని తెలిపారు. దీంతో అర్హులైన రైతులను సులభంగా గుర్తించి పథకాల లబ్ధిని నేరుగా అందించేందుకు వీలవుతుందని చెప్పారు. ముఖ్యంగా ప్రధానమంత్రి కిసాన్, పంట బీమా, పంట నష్టపరిహారం, ఇన్పుట్ సబ్సిడీ, అన్నదాత సుఖీభవ వంటి పథకాల మంజూరులో ఈ గుర్తింపు సంఖ్య కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, ఎండలు వంటి పరిస్థితుల్లో పంట నష్టం జరిగినప్పుడు పరిహారం త్వరితగతిన అందించడానికి ఏపీ ఎఫ్ ఆర్ ఆధారం అవుతుందని తెలిపారు. రైతుల వివరాలు స్పష్టంగా నమోదు అయి ఉండటం వల్ల మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా లబ్ధి అందే విధానం అమలు అవుతుందని చెప్పారు. నల్లమాడ మండలంలో ఇంకా 1248 మంది రైతులు నమోదు చేసుకోలేదని వెల్లడించిన ఆయన, రైతు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. నమోదు చేయని రైతులు ఆధార్ కార్డు, పొలం పాస్బుక్ ప్రతులు మరియు ఆధార్కు అనుసంధానమైన మొబైల్ ఫోన్తో వచ్చి నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతుల హక్కులు రక్షించుకోవడానికి, భవిష్యత్లో ప్రభుత్వ సహాయాన్ని నిరంతరంగా పొందడానికి ఏపీ ఎఫ్ ఆర్ నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్

# ఉబరైజేషన్పై రైతులకు అవగాహన

**మండల వ్యవసాయ అధికారి నాగరాజు..**

అగళి,తెలుగోడు ఫిబ్రవరి 11:
పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధవారం అగళి, కోడిపల్లి,మధూడి గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఉబరైజేషన్ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఉబరైజేషన్ లో భాగంగా రైతులు ఓలా, ఉబర్,రాపిడో మాదిరిగా వ్యవసాయంలో కిసాన్ డ్రోన్స్, ట్రాక్టర్లు,మిగతా యంత్ర పరికరాలు కూడా ఆన్లైన్లో బుక్ చేసుకుని వారికి తగిన సమయంలో వాటిని బాడుగకు వాడుకోవచ్చు అని అన్నారు. ముఖ్యంగా రైతు సోదరులు ఉబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్ అనే యాప్ ను ప్లే స్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకొని రైతులు వారి పేరు,ఆధార్ కార్డు ఫోన్ నెంబరు రైతు వివరాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయితే ఓటిపి వస్తుందని, ఓటిపి వచ్చిన తర్వాత లాగిన్ అయితే అక్కడ అందుబాటులో ఉన్న పరికరాలు వివరాలు కనిపిస్తాయని, ఆ పరికరాలను నమోదు చేసుకున్నట్లయితే సంబంధిత పరికరాలు ఉన్న యజమానికి మెసేజ్ వెళుతుంది వాళ్లు ఓకే చేసినట్లయితే వీళ్ళకి యాక్సెప్ట్ అయినట్లు మెసేజ్ వస్తుందన్నారు.
వాళ్లు నిర్దేశించిన సమయం ప్రకారం వచ్చి వాళ్ళు చెప్పిన పని డ్రోన్స్ అయితే స్ప్రేయింగ్ చేయడం ట్రాక్టర్లు మరియు మిగతా పరికరాలు పొలాన్ని దున్నడం వంటి పనులు సకాలంలో చేయడం జరుగుతుంది, కాబట్టి రైతు సోదరులు ఈ అవకాశం ను ఉపయోగించుకొని కిసాన్ డ్రోన్స్, యంత్ర పరికరాలను వారికి కావలసిన సమయంలో తక్కువ ధరకి బాడుగకు పొంది పెట్టుబడిని తగ్గించుకోవచ్చు అని మండల కన్వీనర్ తిప్పేస్వామి, శ్రీ కృష్ణ కిసాన్ డ్రోన్ రైతు మిత్ర గ్రూప్ కన్వీనర్ కెంచు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సోదరులు,ప్రజాప్రతినిధులు రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.




రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి నాగరాజు



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయ అధికారి నాగరాజు



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు కవిత

# కరాటే పోటీల్లో బత్తలపల్లి విద్యార్థుల ప్రభంజనం

**విజ్ఞాన భారతి పాఠశాలకు 26 పతకాలు..**

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
హైదరాబాద్లో నిర్వహించిన 5వ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్షిప్లో బత్తలపల్లిలోని విజ్ఞాన భారతి పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభతో 26 గోల్డ్,వెండి, కాంస్యం పథకాలు దక్కించుకున్నట్లు విజ్ఞాన భారతి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మున్నంగి కవిత, కరెస్పాండెంట్ మున్నంగి వెంకటకృష్ణ పేర్కొన్నారు. బుధవారం బత్తలపల్లిలోని జ్ఞాన భారతి పాఠశాలలో వారు విలేకరులతో మాట్లాడుతూ న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో ఐదు రాష్ట్రాల నుంచి వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజ్ఞాన భారతి పాఠశాల నుంచి 36 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 26 మంది పతకాలు సాధించడం విశేషం. ఏడుగురు విద్యార్థులు బంగారు పతకాలు గెలుచుకుని పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. షగుప్తా, నమన్, వరుణ్ తేజ్, ముఖేష్, దర్శన్ రానా, చరణ్, మల్లికార్జునలు గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా మరో 9 మంది వెండి పతకాలు, 10 మంది కాంస్య పతకాలు అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు రాణించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మున్నంగి కవిత, కరస్పాండెంట్ మున్నంగి వెంకటకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. విజేత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఘనంగా పండిట్ దీన్దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

**బిజెపి నాయకులు ఎస్ చంద్రశేఖర్ నివాళులు..**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
మహానేత పండిట్ దీన్దయాళ్ ఉపాధ్యాయ జీవితమంతా దేశ సేవకే అంకితం చేశారని బిజెపి సీనియర్ నాయకులు, మడకశిర సింగిల్ విండో డైరెక్టర్ ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. దీన్ దయాల్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్ననాటి నుంచే అనేక కష్టాలు ఎదురైనా, దేశభక్తి సమాజ సేవ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ఎప్పుడూ తగ్గలేదు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా దేశ రాజకీయాల్లో సాంస్కృతిక విలువలు, జాతీయత, సమగ్ర అభివృద్ధి అనే సిద్ధాంతాలను ప్రవేశపెట్టారు. దీన్దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించిన “అంత్యోదయ” “ఏకాత్మ మనవతా సిద్ధాంతం” భారతదేశ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలిచాయన్నారు. సమాజంలో చివరి వ్యక్తి అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన నమ్మకం. పేదలు, రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజల కోసం ఆయన చేసిన సేవలు ఎన్నటికీ మరవలేనివన్నారు.
దేశ సేవే ధర్మమని భావించి, వ్యక్తిగత జీవితం గురించి ఆలోచించకుండా దేశం కోసం కష్టపడ్డ మహానుభావుడు ఆయన. 1968లో అనుమానాస్పద పరిస్థితుల్లో ఆయన ప్రాణత్యాగం చేశారు. దేశం కోసం జీవించి, దేశం కోసం ప్రాణం అర్పించిన గొప్ప దేశభక్తుడు అన్నారు. మనమందరం ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, సమాజ సేవ, దేశ సేవ చేయడం ద్వారా ఆయనకు నిజమైన నివాళులు అర్పిద్దాం. ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు, ప్రతి పౌరుడు ఆయన ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పండిట్ దీన్దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు సజీవంగా నిలవాలని, ఆయన త్యాగం, సేవలు మనకు ఎప్పటికీ స్ఫూర్తి కావాలన్నారు.



దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న బిజెపి నాయకులు ఎస్ చంద్రశేఖర్




పోస్ట్కార్డు ఉద్యమం చేపట్టుతున్న యూటీఫ్ నాయకులు

# పిఆర్సి కమిషన్ చైర్మన్ను వెంటనే నియమించాలి

**29 శాతం ఐఆర్ ప్రకటించాలి..**
**యూటీఫ్ నాయకులు డిమాండ్..**

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 11 :**
పిఆర్సి కమిషన్ చైర్మన్ను వెంటనే నియమించాలని యూటీఫ్ నాయకులు డిమాండ్ చేశారు. 29 శాతం ఐఆర్ ప్రకటించాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ ఆర్థిక సమస్యలపై మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి. ఎన్. మాలింగప్ప,వై.జోగప్ప ఆధ్వర్యంలో 500 పోస్ట్ కార్డులను ముఖ్యమంత్రికి పంపారు. ఈ సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా యూటీఫ్ గౌరవ అధ్యక్షులు కే.భూతన్న, జిల్లా కార్యదర్శి డి నరసింహప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ప్రభుత్వమని నిరూపించుకోవాలంటే 12వ పి ఆర్ సి కమిషన్ చైర్మన్ ను నియమిస్తూ, 29 శాతం ఐ ఆర్ ను వెంటనే ప్రకటించాలన్నారు.ఉద్యోగుల, పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు రూట్ మ్యాప్ ప్రకటించాలని సి పి ఎస్ ను రద్దు చేయాలని 57 ప్రకారం 2004 ముందు నియామక ప్రక్రియ పూర్తయిన వారికి ఓ పి ఎస్ ను అమలు చేయాలని హెల్త్ కార్డులు ,మెడికల్ బిల్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఈ బడ్జెట్ సమావేశాల్లోనే వీటిపై నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పోస్ట్ కార్డులను పంపిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో యూటీఫ్ నాయకులు శ్రీమతి జయమ్మ, ఇ.నరసింహమూర్తి, నంజప్ప, సూర్య ప్రకాష్,ఓబుల కృష్ణ ఆంజనేయులు, సత్యనారాయణ చారి పాల్గొన్నారు.

# 14న దామోదరం సంజీవయ్య విగ్రహ ప్రతిష్ఠ

**విజయవంతం చేయండి ..**
**పి.బ్యాడిగెర భరత్..**



అగళి,తెలుగోడు ఫిబ్రవరి 11:
మడకశిర పట్టణంలోని ఆర్డిఓ కార్యాలయం సర్కిల్లో నియోజకవర్గ మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న భారతదేశంలోనే దళిత (మాల) మొట్టమొదటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మాల సోదర సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పి.బ్యాడిగెర గ్రామానికి చెందిన భరత్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా మడకశిర నియోజకవర్గంలోని అగళి, రొల్ల,గుడిబండ, అమరాపురం,మడకశిర మండలాల్లోని మాల సోదర సోదరీమణులు ప్రతి ఒక్కరూ తప్పకుండా హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా మాల సమాజానికి చెందిన వ్యక్తి దామోదరం సంజీవయ్య అన్ని వర్గాల ప్రజలకు రిజర్వేషన్ అమలుతోపాటు ఉపాధ్యాయులు మరియు ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టడంతో పాటు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల అభ్యున్నతి కోసం పాటుపడి అనేక సంస్కరణలను తీసుకువచ్చారని అన్నారు.అలాంటి మహనీయుడి విగ్రహం ను ప్రతిష్టించడం ఆనందదాయకమన్నారు ఈ ప్రతిష్టాపన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి మాల సోదరులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భరత్ కోరారు.



ఆర్ఐ జెర్మియాకు సార్వత్రిక సమ్మె నోటీసు అందజేస్తున్న వీఆర్ఏలు

## లేబర్ కోడ్స్ అమలుపై కార్మిక సంఘాల ఆందోళన

వీఆర్ఏల సమ్మె నోటీసు ..

పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన 'లేబర్ కోడ్స్'ను రద్దు చేయాలని వీఆర్ఏల సంఘం మండల నాయకులు భీమన్న, చిన్న నరసయ్య, హైమావతి, రమేష్, నాగప్ప డిమాండ్ చేశారు. బుధవారం పెద్దకడబూరులోని మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె నోటీసును ఆర్ఐ జెర్మియాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా రూపొందించిన చట్టాలను దేశవ్యాప్తంగా అమలు చేయడాన్ని విమర్శించారు. లేబర్ కోడ్స్ కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. యూనియన్లు ఏర్పాటు చేసుకునే హక్కు, సమ్మె హక్కు వంటి మౌలిక హక్కులను బలహీనపరుస్తున్నాయని తెలిపారు. పని గంటల పెంపు, మహిళలను రాత్రి షిఫ్టుల్లో పనిచేయించే విధానాలు, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టబద్ధ హక్కులను ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడ్డారు. కోట్లాది మంది కార్మికుల జీవన పరిస్థితులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని గంటలను 8 గంటల నుంచి 13 గంటల వరకు పొడిగించడం కార్మిక వర్గంలో అసంతృప్తిని పెంచిందని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో వీఆర్ఏల సమస్యలు ఇంకా పరిష్కారానికి నోచుకోలేదని వీఆర్ఏలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడిచినా తమ సమస్యలపై స్పష్టమైన చర్యలు కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత 8 సంవత్సరాలుగా జీతాలు పెరగకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. పొరుగు తెలంగాణ రాష్ట్రంలో వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేస్తున్నప్పటికీ, ఏపీలో కేవలం రూ.11,000 మాత్రమే జీతంగా చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. వీఆర్ఏల నియమ నిబంధనలకు విరుద్ధంగా నైట్ డ్యూటీలు విధిస్తున్నారని, టిఏ, డిఏ కింద ఎటువంటి భత్యాలు చెల్లించడం లేదని ఆరోపించారు. రీ సర్వే పేరుతో సొంత గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో కూడా డ్యూటీలు వేస్తూ అదనపు భారం మోపుతున్నారని తెలిపారు. దశాబ్దాలుగా పనిచేస్తున్న నామినీలను వీఆర్ఏలుగా గుర్తించి పోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. ఖాళీగా ఉన్న వీఆర్వో, అటెండర్, నైట్ వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల్లో వీఆర్ఏలకు 70 శాతం కేటాయించాలని, డిఏను జీతంలో కలపాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైం ఉద్యోగులుగా ఉన్న తమపై అక్రమ డ్యూటీల భారం మోపడం శ్రమ దోపిడీకి దారితీస్తోందని విమర్శించారు. వీఆర్ఏలకు పే స్కేలు జీతాలు, ప్రమోషన్లు, నామినీల గుర్తింపు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో వీఆర్ఏలు కూడా పాల్గొననున్నట్లు ప్రకటించారు. తమ హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## ఉపాధి హామీ పథకం పేరు మార్పును ఉపసంహరించుకోవాలి

కాంగ్రెస్ పార్టీ డిమాండ్

పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పును తక్షణం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆనందరాజు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దకడబూరు మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ ఆవరణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "పథకం పరిరక్షణ యాత్ర" పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆనందరాజు మాట్లాడుతూ, 'వికసిత్ భారత్ జీ రామ్ జీ' పేరును రద్దు చేసి, పథకానికి మహాత్మాగాంధీ పేరు పునరుద్ధరించాలని కోరారు. గ్రామీణ కూలీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రోజువారీ కనీస వేతనాన్ని రూ.600కు పెంచాలని, పని దినాలను 150కు విస్తరించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం రాష్ట్రాల నిధుల వాటాను 60:40 నిష్పత్తికి బదులుగా యధావిధిగా 90:10 నిష్పత్తిలో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాలు, పంచాయతీల అధికారాలను పునరుద్ధరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసి సెల్ చైర్మన్ హనుమంతరెడ్డి, నియోజకవర్గ నాయకులు తిక్కన్న, నాయకులు నరసప్ప, బాషా తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెకు సహకరించి జయప్రదం చేయండి

సిఐటియు ఏఐటీయూసీ రైతు కార్మిక సంఘాల విజ్ఞప్తి

కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

దేశ వ్యాప్తంగా గురువారం జరుగుతున్న సమ్మెకు ఉద్యోగ ,కార్మిక ,రైతు, వ్యవసాయ, కూలీలు సహకరించి జయప్రదం చేయాలని. కోసిగి మండల సిఐటియు ఏఐటీయుసీ కార్మిక సంఘాలు రైతు సంఘాల నాయకులు సుదర్శన్, రాముడు, వీరేష్, గోపాల్, తాయన్న, స్వామి,లు కోరారు బుధవారం కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరుగు సమ్మెను జయప్రదం చేయాలని బ్యాంకులు సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ప్రభుత్వ కార్యాలయాలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు సుదర్శన్ సిఐటియు జిల్లా నాయకులు రాముడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న లేబర్ కోడ్ల కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని అదేవిధంగా వికసిత్ భారత్ జి రామ్ జి చట్టం ఉపాధి కూలీలకు పనులు తగ్గి వలసలు పెరుగుతాయని విద్యుత్ సవరణ చట్టం వల్ల స్మార్ట్ మీటర్లు తీసుకువచ్చి రైతుల పైన ప్రజల పైన భారం మోపుతుందని విత్తన చట్టం వల్ల రైతులు వ్యవసాయానికి దూరం కావాల్సిన పరిస్థితి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తుందని కావున ఈ చట్టాలకు వ్యతిరేకంగా నేడు జరిగే ఉద్యోగ కార్మికులు ఉపాధి కూలీలు రైతులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.



బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం



టీడీపీ యువనేత రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు
రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా స్వీట్లు పంచుకొంటున్న టీడీపీ నాయకులు

# రామకృష్ణారెడ్డి రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదగాలి

## ఘనంగా మంత్రాలయం సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

మంత్రాలయం సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదిగి ప్రజాసేవకు అంకితం కావాలని టీడీపీ సీనియర్ నాయకులు బసలదొడ్డి ఈరన్న, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడిగుడ్ల ఏసేపు, టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున, ఆర్టీఎస్ తాలూకా కన్వీనర్ దశరథ రాముడు, చిన్నతుంబళం సొసైటీ ఛైర్మన్ కందనాతి నరసప్ప, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొట్రు రామాంజనేయులు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, టీడీపీ బూత్ యూనిట్ ఇన్ చార్జ తలారి అంజీ ఆకాంక్షించారు. బుధవారం పెద్దకడబూరు గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున ఆధ్వర్యంలో మంత్రాలయం సొసైటీ ఛైర్మన్ రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. బాణాసంచా పేల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ యువనేతగా రామకృష్ణారెడ్డి భవిష్యత్తులో రాజకీయంగా మరిన్ని పదవులను అవరోదించి ప్రజా సేవకు అంకితం కావాలని కోరారు. రాబోయే రోజుల్లో మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ రాఘవేంద్ర రెడ్డి సారథ్యంలో మంత్రాలయం పీఠంపై టీడీపీ జెండా ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేసి మండలంలోని అన్ని పంచాయతీలలో టీడీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం స్తానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సంఘం అధ్యక్షులు సత్యన్న గౌడ్, టీడీపీ మండల కార్యదర్శి పూజారి ఈరన్న, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మునెప్ప, టీడీపీ నాయకులు బీపీ ఈరన్న, మురళీ కృష్ణ, సొంటెన్న, జనార్ధన్, దుమ్మల శివ, నరసింహులు, ఏక్ హనుమంతు, హులికన్వి సత్యన్న, కల్లుకుంట తాయన్న, జాలవాడి బోయ యంకన్న, మేకడోణ రాఘవరెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున



పీహెచ్సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు.
రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

# దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

## వామపక్షాల నేతలు పిలుపు ..

పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

లేబర్ కోడ్లు రద్దుకై జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న పిలుపునిచ్చారు. బుధవారం పెద్దకడబూరులోని ప్రెస్ క్లబ్ నందు వామపక్షాల ఆధ్వర్యంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయ, మండల సహాయ కార్యదర్శి కుమ్మరి చంద్ర మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీహార్ ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత లేబర్ కోడ్ లను అమల్లోకి తెచ్చిందని ఆరోపించారు. కేవలం కార్పోరేట్ల ఒత్తిడితోనే పాలకవర్గం లేబర్ కోడ్లు అమల్లోకి తెచ్చిందని, దీని వల్ల ఒక్కటైనా కార్మికులకు ఉపయోగపడే అంశం ఉందా అని వారు ప్రశ్నించారు. పని గంటలను కూడా 8 గంటల నుంచి 12 గంటలకు పెంచిదన్నారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ పథకం కూడా కేంద్రం నీరు గార్చిందన్నారు. అలాగే విద్యుత్ సవరణ, విత్తనాల సాధన బిల్లులను బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేటందుకు నేడు అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు, సంయుక్త కిసాన్ మోర్చాల ఆధ్వర్యంలో సమ్మెకు పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి దేవదాసు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, నాయకులు నాగరాజు, రెక్కల గిడి, వీరేష్, హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు తిక్కన్న,




సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష నాయకులు వీరేష్

# పులి కనుమ లీకేజ్ నీటితో పంట నష్టం

కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

. మండల పరిధిలోని సాతనూరు గ్రామ సమీపాన తుంగభద్రా నది ఒడ్డున ఏర్పాటు చేసిన పులి కనుమ రిజర్వాయర్ పంప్ హౌస్ నుండి పులికనుమ రిజర్వాయర్ కు నీరు పంపించేసే క్రమంలో మధ్యలో సాతనూరు గ్రామానికి సంబంధించిన పొలాల్లో ఎయిర్ వాల్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఎయిర్ వాల్ ఏర్పాటు చేయటం వల్ల నీరు పంపింగ్ చేసే సమయంలో నీరు ఎక్కువ గా లీకేజీ కావడం వల్ల చుట్టుపక్కల ఉన్న రైతుల పొలాల్లో నీరు వెళ్లి పంట నష్టం జరుగుతున్నట్లు రైతులు దేవేంద్ర రెడ్డి , మల్లయ్య , ఈరన్న ,సూరి లు తెలిపారు. ఈ లీకేజీ నీరు వల్ల దాదాపు 50 ఎకరాల్లో పంట నష్టం జరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంట పొలాల్లో వరి సాగు చేసే వాళ్ళమని అయితే ఈ పంప్ హౌస్ ఎయిర్ వాల్ ఏర్పాటు చేయకముందు ఎకరాకు 40 బస్తాల దిగుబడి వచ్చేదని , వాల్ ఏర్పాటు చేసిన తర్వాత లీకేజీ నీటితో లోపల ఉన్న వండ్రు మట్టి , సౌడు కొట్టుకు వచ్చి పొలాల్లో పడటం వల్ల పంట నష్టం జరిగి ఎకరాకు 20 సంచులు మాత్రమే దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఫిర్యాదు చేసినప్పుడల్లా తూతు మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. తుంగభద్ర నది నుండి నీరు పంపింగ్ చేసే క్రమంలో పులికనుమ రిజర్వాయర్కు వెళ్లాల్సిన నీరు పూర్తిగా 40 శాతం వరకు ఇక్కడే లీకేజీ అవుతుందన్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయి మరమ్మత్తులు చేసి లీకేజీ నీరు పొలాల్లో రాకుండా చేయాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో పంట నష్టం అయినా రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.



లీకేజ్ వాల్వ్ దగ్గర వృధాగా వెళుతున్న నీరు



పంట పొలాల్లోకి చేరిన నీరు



కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

## ఘనంగా రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

. మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి సోదరుడు మంచాల సొసైటీ అధ్యక్షులు ఎన్ రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక తీరుబజార్ ఆవరణలో బుధవారం టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ముత్తు రెడ్డి , టిడిపి మండల కన్వీనర్ పల్లెపాడు రామిరెడ్డి , మార్కెట్ యార్డ్ చైర్మన్ చింతలగేని. నర్సారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సింగిల్ విండో అధ్యక్షుడుగా రైతులకు కార్యక్రమాలు చేశారని కొనియాడారు. రాబోయే రోజుల్లో మంత్రాలయం అభివృద్ధిని టిడిపి ప్రభుత్వంలో మరింత ముందుకు తీసుకెళ్ళాలన్నారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తోవి. రామకృష్ణ, వక్రాణి.వెంకటేశ్వర్లు గాలేం.వీరేష్, సొట్టయ్య, అరివిలి.వీరేష్, వందగల్లు. నరసింహులు, తుంబిగనూరు. గోపాలు, బెళగల్.గోపాల్ ,రంగారెడ్డి, వీరారెడ్డి, పంపా, కోల్మన్ పేట వీరారెడ్డి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు



ఎంపీడీవో మణిమంజరిని మర్యాదపూర్వకంగా కలిసిన ఐహెచ్ఆర్ఎఫ్ ఛైర్మన్ అంజినయ్య

## ఎంపీడీవో మణిమంజరిని కలిసిన ఐహెచ్ఆర్ఎఫ్ ఛైర్మన్ అంజినయ్య

పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. అంజినయ్య బుధవారం గోనెగండ్ల ఎంపీడీవో మణిమంజరిని మర్యాదపూర్వకంగా కలిశారు. గోనెగండ్ల మండల అభివృద్ధిపై చర్చించారు. ఈ భేటీలో ముఖ్యంగా మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన మరియు ప్రభుత్వ పథకాల అమలు తీరు గురించి టి.అంజినయ్య ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత ఉండాలని, సామాన్య ప్రజలకు మరియు పేదలకు అందాల్సిన ప్రభుత్వ ఫలాలు సక్రమంగా అందేలా చూడాలని ఆయన కోరారు. గోనెగండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న తాగునీరు, రహదారులు మరియు పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఐహెచ్ఆర్ఎఫ్ స్వచ్ఛంద సంస్థగా పనిచేస్తూ ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తుందని తెలిపారు.



## గురుకుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

ప్రిన్సిపాల్ అపర్ణ

అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

అమరాపురం మండలంలోని హాలకూరు సమీపంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదు మరియు ఇంటర్ ప్రవేశాలకు 2026-27 అకాడమిక్ సంవత్సరానికి చేర పోవు విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అపర్ణ తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 19వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ

అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :

అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు. అసెంబ్లీలో పవన్ కళ్యాణ్ ఛాంబర్‌కు వెళ్లిన లోకేష్ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. అదేవిధంగా బడ్జెట్ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.





పార్టీ కార్యకర్తలతో కూటమి నేతలు

## కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి

*లిటిడిపిలోకీ వైసిపి కార్యకర్తల చేరిక..*

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమైతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ , ఏపీ ఆర్టీసీ వైస్ చైర్మన్ పి ఎస్ మునిరత్నం పేర్కొన్నారు. ఉన్సిగాని పల్లి పంచాయతీకి చెందిన వైసీపీ కార్యకర్తలు 20 కుటుంబాల టిడిపి పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకి కుప్పం నియోజకవర్గ పరిధిలోని జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరారు. అభివృద్ధిలో భాగస్వాములై తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ మునస్వామి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ,మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు సులోచన గుర్రప్ప, మాజీ మండల అధ్యక్షులు ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కామరాజు నాయక్, జిల్లా నాయకుడు పట్రా నారాయణ,యూనిట్ ఇంచార్జ్ మాజీ సర్పంచ్ రామ్మూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ నాగభూషణం, కో క్లస్టర్ శంకర్ చలం, మాజీ సర్పంచ్ జయశంకర్, పంచాయతీ నేతలు మనీష్, మహేంద్రనాయుడు, సుభాష్ రామలింగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు

## బంతిపూల సాగుపై రైతులకు అవగాహన సదస్సు

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** కొత్త రకం బంతిపూల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు. బుధవారం రాజుపేట లోని సుధాకర్ రెడ్డి రైతు పొలంలో బంతి సాగులో కొత్త రకానికి మిగిలిన రకాలకు తేడా గురించి తెలియజేశారు. కొమ్మ దృఢత్వం పూలు నాణ్యత, నిల్వ కాలము ఎక్కువగా ఉంటుందని రైతులు దీనిపై మొగ్గు చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా పూల మొక్కలు సబ్సిడీలు అందిస్తుందని వివరించారు. రైతులకు హంద్రీ-నీవా జలాలతో కుప్పం ప్రాంతం పంటల సాగుకు అనువైన ప్రదేశం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు, ఏఎంసి చైర్మన్ జిఎం రాజు, టిడిపి మండల అధ్యక్ష , మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి,కుప్పం, రామకుప్పం జనసేన అధ్యక్షుడు నరేష్, హరీష్,రైతు సంఘం అధ్యక్షుడు చలపతి, ఉద్యాన అధికారి రామాంజనేయులు, సంచాలకులు కోటేశ్వరరావు, పల్లవి, శివారెడ్డి, డింపు ప్రియా, శాంతిపురం ,రామకుప్పం, గుడిపల్లి,పూల సాగు రైతులు పాల్గొన్నారు.




రైతులకు టార్పాలిక్ పట్టలు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహకులు అందిస్తుందని గ్రంథాలయ డైరెక్టర్ మునస్వామి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వ్యవసాయ కేంద్రంలో రైతులకు పట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా నెరవేరని కలను సాగు, త్రాగునీటిని సీఎం చంద్రబాబు నాయుడు హంద్రీ-నీవా జలాలను కుప్పం నియోజకవర్గం తీసుకొచ్చిన అపర భగీరథుడు అన్నారు. రైతులు కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. వ్యవసాయంపై జీవనం సాగిస్తున్న రైతులు సంఘాలుగా ఏర్పడి బ్యాంకు రుణాలతో ఆర్థిక అభివృద్ధి పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సులోచన గురప్ప, జిల్లా నేత నారాయణ చారి,పార్టీ కార్యదర్శి కామరాజు నాయక్ ,ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, సింగల్ విండో చైర్మన్ మహమ్మద్ రఫీ, క్లస్టర్ ఇన్చార్జులు రవి రెడ్డి, మంజునాథ్ రెడ్డి, నందా రెడ్డి, టీవి రవి, అల్లి శీన, పవన్ కుమార్, మంజునాథ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

### మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

**హైదరాబాద్ (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** : జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్‌లను కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. జీహెచ్ఎంసీ కార్పొరేషన్ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్, సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజన, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణా రెడ్డిలను నియమించింది.

# చిత్తశుద్ధితో విధులు నిర్వహించండి

**విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దండి**
**మాహాశివరాత్రికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు..**
**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా..**

**నెల్లూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** అప్పగించిన విధులను చిత్తశుద్ధితో నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని శంకరన్ హాలులో జేసి మొగిలి వెంకటేశ్వర్ల తో కలసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లమండల స్థాయి వీడియో కాన్ఫెరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫెరెన్సు లో ఎస్ఎస్‌సి - 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఎస్ఎస్‌సి విద్యార్థుల దీర్ఘకాల గైర్హాజరు వారికి రెసిడెన్షియల్ శిబిరాలు, పాఠశాలల్లో సివిల్ పనుల స్థితి, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షర ఆంధ్ర, 1 నెల -1 గ్రామం - 4 సందర్శనలు, ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ప్రభుత్వ అకౌంట్లను వాడుకలోకి తీసుకురావడం, ఈ - పంట నమోదు, ఉద్యమ్ పోర్టల్ నమోదు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేసి పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని గణనీయంగా పెంచాలన్నారు.ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించడం, నియమిత మాక్ టెస్టులు చేపట్టడం, విద్యార్థుల ప్రగతిపై నిరంతర మానిటరింగ్ చేయాలని ఆదేశించారు.వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక రెసిడెన్షియల్ శిబిరాలు నిర్వహించి వారిని ఉత్తీర్ణత సాధించే విధంగా శిక్షణ ఇవ్వాలన్నారు.పాఠశాలల్లో కొనసాగుతున్న సివిల్ పెండింగ్ పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సమగ్ర శిక్ష శాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.
అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేసి నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలని ఆదేశించారు. శివరాత్రి పండుగను పురస్కరించుకుని దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విషయమై ఆర్డీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు.యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను వేగంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలన్నారు.అర్జీలను కేవలం స్వీకరించి పరిష్కరించడం కాకుండా, ప్రజలకు శాశ్వత పరిష్కారం అందించడమే" 1- నెల1 - గ్రామం -4 సందర్శనలు "" కార్యక్రమం ఉద్దేశ్యం అన్నారు.ఇందులో భాగంగా రెవెన్యూ యంత్రాంగం ఆయా గ్రామాలను నెలలో నాలుగు సార్లు సందర్శించి రికార్డు లోపాలు, సర్వే తేడాలు, భూవివాదాలు తదితర సమస్యలను గుర్తించి అదే నెలలో ఎవరికి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలన్నారు.ఇన్‌యాక్టివ్‌గా ఉన్న ప్రభుత్వ అకౌంట్ల వివరాలపై కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ శాఖల బ్యాంకు ఖాతాలన్నీ వాడుకలో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు రిక్వెస్ట్ లెటర్, ఆధార్, సిటిసి, ఐడి కార్డు తో ఆయా బ్యాంకుల్లో సంప్రదించి ఇన్‌యాక్టివ్ ఖాతాలను వాడుకలోనికి తీసుకురావాలన్నారు.
రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన ఈ - పంట నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యమ్ పోర్టల్ నందు నమోదు చేయని ఎం ఎస్ ఎం ఈ యూనిట్లను వెంటనే పోర్టల్ నందు నమోదు చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ఉద్యమ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్‌ను చట్టబద్ధమైన గుర్తింపుగా ప్రవేశపెట్టిందన్నారు.ఉద్యమ రిజిస్ట్రేషన్ ఎం ఎస్ ఎం ఈ యూనిట్లకు చట్టబద్ధమైన గుర్తింపుగా ఉండి, బ్యాంకు రుణాలను పొందుటకు అవసరమని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో నమోదు చేయని యూనిట్లను ఉద్యమ పోర్టల్‌లో నమోదు చేయించేందుకు మండల స్థాయిలో వర్క్‌షాప్‌లు నిర్వహించాలని, యంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్వో విజయకుమార్, జిల్లా అధికారులు కలెక్టరేట్ నుండి పాల్గొనగా, ఆర్డీవోలు, ఎంపిడివోలు తమ తమ కార్యాలయాల నుండి హాజరయ్యారు.




మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా..

# సాగర్ మిత్ర సేవలను కొనసాగించండి

**కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్‌కు ఎంపీ వేమిరెడ్డి వినతి ..**

**నెల్లూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** రాష్ట్రం నెల్లూరు జిల్లాలో మత్స్యశాఖ కింద పనిచేస్తున్న సాగర్ మిత్రల సేవలను కొనసాగించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్రమంత్రి కార్యాలయంలో ఆయన్ను కలిసిన ఎంపీ.. ఆంధ్రప్రదేశ్ సాగర్ మిత్ర ఎంప్లాయీస్ యూనియన్ తరఫున వినతిపత్రం అందజేశారు.పీఎంఎంఎస్‌వై( ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన) ఫేజ్-× కింద నియమించబడిన సాగర్ మిత్ర సేవలు 31.03. 2026న ముగియనున్నాయని, ఫేజ్-× మూసివేతకు రెండు నెలల ముందే నోటీసు కూడా జారీ చేయబడిందన్నారు. ఈ దశలో వారి సేవలను అకస్మాత్తుగా నిలిపివేయడం పి ఎంఎం ఎస్ వై కింద సాధించిన ప్రగతిపై ప్రతికూల ప్రభావం పడే వీలుందన్నారు. 2021--22లో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ( పి ఎం ఎం ఎస్ వై ) కింద నియమించబడిన సాగర్ మిత్రలు స్థానిక మత్స్యకారులకు వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల గురించి అవగాహన కల్పించడం, తీరప్రాంత మత్స్యకార వర్గాల మధ్య కీలకమైన అనుసంధానంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు తీరప్రాంత గ్రామాలలో అట్టడుగు స్థాయిలో పని చేస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నారని అన్నారు. మత్స్యకారులకు వాతావరణ సూచనలు, సంభావ్య ఫిషింగ్ జోన్లు, ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు హెచ్చరికలు, పి ఎం ఎం ఎస్ వై, ఇతర మత్స్యకార సంబంధిత పథకాలు, సబ్సిడీలు మొదలైన వాటిపై అవగాహన కల్పించడం, ఫిషింగ్ పద్ధతులను సులభతరం చేయడం, మత్స్యకారుల జీవనోపాధికి మద్దతు ఇవ్వడం వంటివి చేస్తున్నారన్నారు. వీటన్నింటి దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 31.03 .2026 తర్వాత వారి సేవలను పొడిగించడానికి ఇప్పటికే వివరణాత్మక ప్రతిపాదనలను సమర్పించిందని, కావున సాగర్ మిత్రల పదవీకాలాన్ని మరింత కాలం పొడిగించడాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్.. సాగర్ మిత్రల సేవలు పొడిగించడంపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని, వారి సేవల కొనసాగించేలా చూస్తామని అన్నారు.



కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్‌తో మాట్లాడుతున్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి

# ఉత్తర క్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రిప్రసన్న

**స్వాతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు..**

**నెల్లూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** కోవూరు తహశీల్దార్ సుబ్బయ్య సతీమణి ఉత్తర క్రియల్లో మాజీ మంత్రిప్రసన్న పాల్గొన్నారు. స్వాతి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు. కోవూరు తహశీల్దార్ చలంచర్ల సుబ్బయ్య సతీమణి చలంచర్ల స్వాతి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. జలదంకి మండలం, కేశవరం గ్రామంలోని వారి స్వగృహంలో మంగళవారం జరిగిన ఉత్తర క్రియల్లో మాజీ మంత్రివర్యులు, వైసీపీ రాష్ట్ర పిఏసిసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారు.స్వాతి చిత్రపటానికి నివాళులర్పించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం సుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు వీరి చలపతిరావు, గొల్లపల్లి విజయకుమార్ , శివుని నరసింహారెడ్డి,రామిరెడ్డి మల్లికార్జున, కలువ బాలశంకర్ రెడ్డి, అత్తిపల్లి అనూప్ రెడ్డి, కాటంరెడ్డి దినేష్ రెడ్డి,బలంరెడ్డి చెంచురెడ్డి,గోపిరెడ్డి భాస్కర్ రెడ్డి, కవరగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కోవూరు తహశీల్దార్ చలంచర్ల సుబ్బయ్య సతీమణి ఉత్తర క్రియల్లో పాల్గొని నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పిఏసిసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి






సుబ్బయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్న మాజీ మంత్రివర్యులు, వైసీపీ రాష్ట్ర పిఏసిసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి

## అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**నెల్లూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు కోవూరు నియోజకవర్గ శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హాజరయ్యారు. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగంలో పాల్గొన్న ఆమె ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి సంక్షేమ ప్రణాళికలను స్వాగతించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ బడ్జెట్ దిక్సూచిగా మారుతుందని స్పష్టం చేశారు.బడ్జెట్‌లో



అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా ముఖ్యంగా మహిళా సంక్షేమం మరియు గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేయాలని ఆమె ఈ సందర్భంగా కోరారు. ?రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



ప్రధాన కాలువకు నీరు వదిలిన దృశ్యం

## గాలేరు నగిరి ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటి విడుదల

*నీటిపారుదల శాఖ అధికారి ఈఈ ఉమామహేశ్వర్లు ..*

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** తాగు, వ్యవసాయ సాగుకు గండికోట రిజర్వాయర్ ప్రాజెక్టు నుండి 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారి ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గండికోట రిజర్వాయర్ ప్రాజెక్టులో 26. 85 టీఎంసీలు నీటి నిలువ ఉండే విధంగా ప్రాజెక్టు నిర్మాణం జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం 25. 5 టీఎంసీల నీరు నిలువ ఉందని ఉన్నత అధికారుల ఆదేశానుసారం విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అయితే కొన్ని రోజుల క్రితం ముద్దనూరు మండల పరిధిలోని రైతులు ప్రజలు, ప్రస్తుతం నియోజకవర్గం లో ఉన్న ప్రజా ప్రతినిధుల సంప్రదించడం జరిగిందని సమాచారం. అయితే ఈ నెల ఆఖరిలో చేస్తామని ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధులు తెలిపిన త్వరగా రైతుల ప్రజల దృష్టిమేరా ఉన్నత అధికారులకు తెలిపి ముందుగానే కమ్మవారిపల్లె దగ్గర ఉన్న రెగ్యులేటర్ ను ఓపెన్ చేసి 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.



వాహన చోదకుల రికార్డులు తనిఖీ చేస్తున్న సిఐ నగేష్ బాబు

## మీ భద్రతే మీ కుటుంబ రక్ష

*సైబర్, రహదారుల రక్షణ, జాగ్రత్తలపై అవగాహన సదస్సులు*
*సీఐ నగేష్ బాబు..*

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** సైబర్ మోసాలలో జాగ్రత్తలు పాటిస్తూ, వాహనంలో వెళుతున్నప్పుడు హెల్మెట్ ధరించి జాగ్రత్తగా రహదారులు నిబంధన పాటించి ప్రయాణిస్తే, ఆ భద్రతలే మీ కుటుంబాలకు రక్ష అని సీఐ నగేష్ బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉప్పలూరు గ్రామంలో పోలీసులు గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సీఐ నగేష్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ప్రజలు అన్నిచోట్ల సైబర్ నేరాలకు, చిక్కుకొని ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. అలాగే రహదారుల నియమ నిబంధనలు పాటించకుండా అతి వేగంగా వెళుతూ మరి ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తూ ప్రమాదాలకు లోనై వారి అవయవాలను కోల్పోవడం కాకుండా మరికొందరైతే అతివేగముల మృతి చెంది వారి కుటుంబాలకు దూరమైపోతున్నారు అన్నారు. రహదారుల నిబంధనలు పాటించని వ్యక్తులు తమ కుటుంబాలకు దూరమయ్యేది కాకుండా ఎదురుగా వస్తున్న వాహన సాధకులు ఢీకొని వారికి కూడా ప్రమాదాలను చేకూర్చి వారి కుటుంబాలను కూడా అవస్థలు పెడుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే అందరూ సురక్షితంగా ఇంటికి చేరవచ్చు అని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఉప్పులూరు, రహదారిలో ముద్దనూరు జాతీయ రహదారిలో, వాహనాల పనికి నిర్వహించి రికార్డ్స్ హెల్మెట్స్ లేనివారికి, జరిమానా విధించి, వారికి సూచనలు ఇచ్చారు.




మాట్లాడుతున్న జిల్లా అధికారి డాక్టర్ జయలక్ష్మి

## కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన

*డిస్ట్రిక్ట్ లెప్రసీ టీబి ఆఫీసర్ డాక్టర్ జయ లక్ష్మీ,*

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 11 :** తాడిపత్రిలోని రోటరీ క్లబ్‌లో బుధవారం స్పర్శ, కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు ఎం సి ఆర్ చెప్పులు, దుప్పటి, చీరలు ప్లేటు గ్లాసుల ౹పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా డిస్ట్రిక్ట్ లెప్రసీ టీబి ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మీ, డిఎన్ఎంఓ గంగాధర్ రెడ్డి, పారామెడికల్ ఆఫీసర్ నాగన్న. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కిషోర్ , విన్నర్ విల్ ప్రెసిడెంట్ , రిటైర్డ్ పి యంఓ సత్య ప్రసాద్ రెడ్డి , తాడపత్రి డిపిఎంవోలు బాల ఓబులు, పి. రామచంద్ర, బి రామదాసు తాడిపత్రి యూపీఎస్సీ డాక్టర్స్, శంకర్, పుల్లయ్య సునీల్ , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. వక్తలు, అధికారులు మాట్లాడుతూ కుష్టువ్యాధి దేవుని శాపం వలన వంశం పరాపరంగా వచ్చే వ్యాధి కాదని ఇది "మైకు బాక్టీరియం లేప్రే" అనే బ్యాక్టీరియా వలన వచ్చే అతి సామాన్యమైన వ్యాధి అని అన్నారు. కుష్టి వ్యాధి ముఖ్యంగా చర్మానికి నరాలకు సోకుతుందని, చాలా నెమ్మదిగా పెరిగి బహిర్గతం కావడానికి 3 నుంచి 5సంవత్సరాలు పడుతుందన్నారు. కుష్టువ్యాధిని ఎండిటి వలన పూర్తిగా నయం చేయవచ్చు ఒకటి నుండి ఐదు మచ్చలు ఉంటేౖదీ అనిఆరు నెలలు మందులు, 5 పైబడిన మచ్చలుంటే వీదీ అని 12 నెలలు చికిత్స అందిస్తారు ఇది పూర్తిగా నయమవుతుంది ప్రారంభ దశలోనే కనుగొంటే అంగవైకల్యం రాకుండా కాపాడుకోవచ్చు. చికిత్స తీసుకున్న వారి లో కానీ చికిత్స పూర్తి అయిన వారిలో కానీ రోగులలో అంగవైకల్యం ఉంటే శస్త్ర శిక్షణ ద్వారా సరి చేయవచ్చునన్నారు. కుష్టువ్యాధితో బాధపడుతున్న వారిని మన కుటుంబ సభ్యులుగా భావించి వారిని సమీప ఆరోగ్య కేంద్రమునకు తీసుకొని వచ్చి వారికి తగిన చికిత్స అందించవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని మీరు వారిపై ఎలాంటి వివక్ష చూపకుండా ప్రేమతో ఆదరించాలని , మహాత్మా గాంధీ కలలు కన్నా కుష్టువ్యాధి రహిత భారతదేశాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 23 మందికి ఎం సి ఆర్ చెప్పులు, దుప్పటి, చీరలు పంచలు ప్లేటు గ్లాసు పంపిణీ చేశారు.



కుష్టువ్యాధి అనుమానం ఉన్న వ్యక్తులకు లేప్రసి ఎం సి ఆర్ చెప్పులు అందిస్తున్న



కాణిపాకం దేవస్థానం తరపున వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ అధికారులు

# మల్లన్న, భ్రమరాంబిక అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పణ

శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :
శ్రీశైలమహాక్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వాళ్లకు కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి తరపున ఉదయం కాణిపాకం ఆలయ అధికారులు పట్టు వస్త్రాలు సమర్పించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరపున సాయంకాలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లకు నూతన పట్టు వస్త్రాలను సమర్పించారు. నూతన పట్టు వస్త్రాలకు ఆలయ రాజగోపురం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్లకు సమర్పించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చక వేద పండితులు పాల్గొన్నారు.



తిరుమల తిరుపతి దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న అధికారులు



వినాయక స్వామివారి చిత్రపటాలు అందిస్తున్న దృశ్యం



ప్రమాదకరంగా మారిన వంతెనలు

# పాడైన వంతెనలు.. పొంచివున్న ప్రమాదం

## ప్రయాణం ప్రమాదకరం.. పట్టించుకోని అధికారగణం ..

హిరమండలం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :
వివిధ ప్రధాన రహదారులు, కాలువలపై దశాబ్దాలకు క్రితం నిర్మించిన పలు వంతెనలు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదాలకు సూచికలు గా నిలుస్తున్నాయి. మండలంలోని పింద్రువాడ, కిట్టాలపాడు గ్రామానికి వెళ్లే రహదారిలో కాలువపై వంతెన ప్రమాదాలకు నిలయాలు గా మారింది.గొట్టా బ్యారేజ్ సాగునీటి ప్రాజెక్టుకు అనుసంధానంగా నిర్మాణం చేపట్టిన ఎడమ ప్రధాన కాలువ నిర్మాణ సమయంలో రహదారి సౌకర్యం కోసం కాలువ పై వంతెనలు నిర్మాణాలు చేపట్టారు.కిట్టాలపాడు రహదారి గుండా మైదాన,గిరిజన గ్రామాలు తో పాటు ఇటీవల ప్రాచుర్యంలో ఉన్న కూర్మ వైదిక ఆశ్రమానికి వెళ్ళడానికి ప్రధాన రహదారి గా ఉంది. కాలువ పై నిర్మాణం చేపట్టిన వంతెన పూర్తిగా పాడవడంతో రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరం గా మారింది. అలాగే పింద్రువాడ కాలువ వంతెన రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారి పింద్రువాడ కాలనీ, మహాలక్ష్మి పురం చవితి సీది,కోదూరు,సత్య జగన్నాధపురం,బొంతుజంక్షన్, టెక్కలి సారవకోట, నరసన్నపేట తదితర మండలాలకు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుంది. వంతెనలు రక్షణ గోడలు పాడవడంతో పాటు గుంతలు ఏర్పడడంతో ప్రయాణం నరకంగా మారింది. ఏ సమయమున ప్రమాదం ముంచుకొస్తుందని ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు.పాత హిరమండలం సమీపంలోని తులగాం గెడ్డ పై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. ఆర్ అండ్ బి అధికారులు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నారు తప్ప శిథిలావస్థకు కల్వర్టు విషయం పై పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యము వివిధ వాహనాలు,వివిధ ప్రాంతాలకు తిరుగుతూ రద్దీగా ఉండే రహదారి లో శిథిలావస్థ కల్వర్టు భయాందోళన గురి చేస్తుంది. ప్రమాదాలు జరిగే వరకు అధికార స్పందించారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించక ముందే అవసరం చోటు మరమ్మతులు, నూతన నిర్మాణాలకు చర్యలు చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు



వంతెనను ఢీకొని ఓ వైపు ఒరిగిన లారీ

# హరహర మహదేవ శంభో శంకర..

## మయూర వాహనంపై దేవిదేవేరులు ..

శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :
శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన బుధవారం నాడు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు ముందుగా స్వామి అమ్మవార్ల ఆలయాల్లో ఉత్సవాలను పురస్కరించుకొని ఉదయం సాయంకాలం అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం సాయంకాలం అక్కామహాదేవి అలంకరణ మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పలు రకాల పుష్పాలతో నూతన వస్త్రాలతో అలంకరింపజేయించి అలంకరణ పూజను అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. మరొకమారు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు



ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తోడ్కొనివస్తున్న ఆలయ అధికారులు

మహా మంగళ హారతులు ఇచ్చి వేద పండితులు వేద మంత్రోచ్చరణల నడుమ మంగళ వాయిద్యాల నడుమ విద్యుత్ దీప కాంతులు కళాకారుల విన్యాసాలు చేస్తుండగా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం ఆలయ రాజగోపురం గుండా శ్రీశైలం పురవీధుల్లోకి ప్రవేశించింది. ఈ గ్రామోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు శివ స్వాములు అడుగడుగునా స్వామి అమ్మవార్లకు కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. కళాకారుల విన్యాసాల నడుమ కోలాటాలు గురవాయ నృత్యాలు శివనామస్మరణతో శ్రీశైలం పురవీధుల్లో గ్రామోత్సవం ఎంతో వైభవంగా ముందుకు సాగింది. ఈ గ్రామోత్సవంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి దంపతులు ఆలయ అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో విన్యాసాలు చేస్తున్న కళాకారులు



# ప్రభుత్వ ఉద్యోగాలకు నకిలీ జాయినింగ్ ఉత్తర్వులు

**బాధితులు నుండి 13.50 లక్షల వసూళ్లు నిందితుడి రిమాండ్.. ఎస్ ఐ వి. హేమంత్ కళ్యాణ్ ..**

హిరమండలం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :
ప్రభుత్వ ఉద్యోగాలకు డబ్బులు తీసుకుని నకిలీ జాయినింగ్ ఉత్తర్వులు అందజేసి మోసగించిన నిందితుడు బోయిన.జనార్దనరావు రిమాండ్ విధించినట్లు హిరమండలం ఎస్ ఐ వి.హేమంత్ కళ్యాణ్ తెలిపారు.బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలు ఆయన విలేఖర్లకు వెల్లడించారు. హిరమండలం మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్న కోరాడ వీధికి చెందిన బోయిన జనార్దన్ రావు హిరమండలం పరిధిలోని ఐదుగురు వ్యక్తులు నుండి సుమారు 13 లక్షల 50 వేలు రూపాయలు వసూలు చేసి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ, నకిలీ జాయినింగ్ లెటర్లు అందజేసి మోసగించారని ఆయన తెలిపారు.తిరిగి డబ్బులు ఇవ్వకపోవడంతో మోసపోయిన బాధితుడు తాటకల్ల.సంతోష్ కుమార్ ఫిర్యాదు మేరకు 2025 సంవత్సరం లో జనార్దనరావు పై చీటింగ్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.మోసగించిన జనార్దనరావు ను అరెస్టు చేసి కొత్తూరు కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించగా నిందితుడు ను శ్రీకాకుళం జిల్లా జైలుకు తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.
ఉద్యోగులు పేరిట మోసపోవద్దు: ఎస్ఐ డబ్బులు ఇస్తే ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ ఐ హేమంత్ కళ్యాణ్ తెలిపారు.ఉద్యోగాల కోసం ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దని కోరారు

# సామాజిక ఆరోగ్య కేంద్రం, ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ

## జిల్లా కలెక్టర్ రాజకుమారి ..

శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :
శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలన పురస్కరించుకొని శ్రీశైలానికి వచ్చే భక్తులకు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న వైద్య సేవలపై జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా భక్తులకు అందిస్తున్న వైద్య చికిత్సలు అత్యవసర సేవలు ప్రధమ చికిత్స సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు రోగులతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్సలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు లభ్యత అత్యవసర మందుల నిల్వలు అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్పందించేలాగా సిద్ధంగా ఉండాలని వైద్యులకు తెలిపారు రే సమయంలో బస్టాండ్ కి వెళ్లి బస్సుల ఫ్రీక్వెన్సీ రాకపోకల సమయాలు వివిధ ప్రాంతాలకు బయలుదేరే బస్సు షెడ్యూలు తదితర అంశాలపై ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు భక్తుల సౌకర్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు రద్దీ పెరుగుతున్న దృష్ట్యా అవసరమైతే అదనపు బస్సులు నడపాలని రాత్రి వేళలో కూడా సేవలు బలోపేతం చేయాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు



30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి



30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండేలాగా చర్యలు తీసుకొని మహాశివరాత్రి కి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.



బస్టాండ్ వద్ద ప్రయాణికులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

# భక్తులతో గౌరవంగా మాట్లాడాలి

## డ్యూటీ ప్రదేశంలో అప్రమత్తంగా ఉండాలి.. సాయుధ బలగాలు, సిబ్బందికి దిశా నిర్దేశం.. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్..

శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 11 :
భక్తులతో గౌరవంగా మాట్లాడాలని, డ్యూటీ ప్రదేశంలో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ అన్నారు. శ్రీశైలం మహా క్షేత్రంలో జరుగుచున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బందోబస్తు విధులకు వచ్చిన స్పెషల్ పార్టీ, ఆర్ముడు రిజర్వు సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు సిబ్బంది కర్నూలు, నంద్యాల అన్నమయ్య జిల్లాల నుండి సుమారు 180 మంది సాయుధ బలగాల సిబ్బందికి జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీశైలంలో శివదీక్ష ధరించిన భక్తులకు సుధూర ప్రాంతాల నుండి ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రయాణించి దైవదర్శనానికి రావడం జరుగుతుందని కావున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా గౌరవప్రధంగా మాట్లాడుతూ వారు వెళ్ళవలసిన మార్గాల



మహాశివరాత్రి బందోబస్తుకు హాజరైన సిబ్బంది

వైపు క్రమశిక్షణతో వెళ్లి దర్శనం చేసుకునే విధంగా దిశా నిర్దేశం చేయాలన్నారువిధులలో ఉన్న సిబ్బంది ఎట్టి పరిస్థితులలోనూ సహనం కోల్పోరాదు. మీకు కేటాయించిన ప్రదేశాలలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలిఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.
బందోబస్తుకు వచ్చిన సిబ్బందిని రెండు సెక్షన్లుగా విభజించి చంద్రావతి కళ్యాణమండపం, ఫ్రీ క్యూ లైన్ ,లడ్డు కౌంటర్, గంగాధర మండపం, నంది సర్కిల్, దాసరి సత్రం ,ఆర్టీసీ బస్టాండ్ , సిద్ధి రామప్ప కాంప్లెక్స్ ,పాతాళగంగ, స్నాన ఘట్టాలు మరియు పార్కింగ్ ప్రదేశాలలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారుఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ శ్రీశైలం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ జీవన్ గంగానాథ్ బాబు రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మంజునాథ్ మరియు బాబు మరికొందరు అధికారులు పాల్గొన్నారు



పోలీస్ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్



## తొలి జీతంతో స్కూలు ప్రారంభం

మహా కుంభమేళాలో పూసల దండలు అమ్ముతూ ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించిన 'కుంభమేళా బ్యూటీ' మోనాలిసా ఇప్పుడు తన జీవితంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. తన మొదటి సినిమా నుంచి వచ్చే రెమ్యునరేషన్‌తో బాలికల కోసం ఒక పాఠశాలను ప్రారంభిస్తానని ప్రకటించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. సాధారణ జీవితం నుంచి సినీ రంగం వరకు ఆమె చేసిన ఈ ప్రయాణం ఇప్పుడు ఎంతో మందికి ప్రేరణగా మారింది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సమయంలో మోనాలిసా దండలు అమ్ముతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమెకు అనూహ్యంగా సినిమా అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం ఆమె సినీ పరిశ్రమలో అడుగుపెట్టి వరుస చిత్రాలతో బిజీగా మారింది.

ఇటీవల ఆమె తొలి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని భావోద్వేగానికి గురైంది. సినీ ప్రపంచంలోకి వచ్చినా తన పాత జీవితాన్ని ఎప్పటికీ మర్చిపోనని, ఆ అనుభవాలే తనకు బలం ఇచ్చాయని తెలిపింది.


ఇటీవల మోనాలిసా మళ్లీ ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి గంగా తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించింది. తన జీవితాన్ని మార్చిన ఆ స్థలానికి కృతజ్ఞతలు తెలుపుతూ, సమాజానికి తిరిగి ఏదో చేయాలనే ఆలోచనతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్ జిల్లాలో బాలికల కోసం పాఠశాల స్థాపించాలన్నదే తన కల అని చెప్పింది. ఆ ప్రాంతాల్లో అమ్మాయిలకు సరైన విద్యావకాశాలు లేవని, చదువు లేక వెనుకబడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.
బాలికల విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, అందుకే తన సంపాదనను వ్యక్తిగత సౌకర్యాల కోసం కాకుండా భవిష్యత్ తరాల కోసం వినియోగించాలనుకుంటున్నానని మోనాలిసా స్పష్టం చేసింది. ప్రస్తుతం ఆమె మూడు సినిమాలతో బిజీగా ఉంది. అందులో రెండు తెలుగు చిత్రాలు కాగా, మరోటి హిందీ చిత్రం 'ది డైరీ ఆఫ్ మణిపూర్'. సినీ రంగంలో ఎదుగుతూ సమాజానికి సేవ చేయాలన్న ఆమె సంకల్పం నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.

## పవన్, సురేందర్ రెడ్డి కాంబో పక్కా మాస్ ఎంటర్టైనర్ మూవీ




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టైలిష్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్ గురించి ఫిలిం నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. సాధారణంగా సురేందర్ రెడ్డి అంటే స్టైలిష్ యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాడు. కానీ ఈసారి పవన్ కళ్యాణ్ కోసం ఆయన తన పంథాను పూర్తిగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. పవన్ చేసిన యాక్షన్ సినిమా కంటే భిన్నంగా గతంలో సురేందర్ రెడ్డి అందించిన 'కిక్', 'రేసుగుర్రం' తరహాలో పక్కా హై-వోల్టేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను పవన్ కోసం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ బాడీ లాంగ్వేజ్‌కు సరిపోయే మేనరిజమ్స్‌తో కూడిన వినోదాన్ని వెలికితీయడమే లక్ష్యంగా రచయిత వక్కంతం వంశీ ఈ స్క్రిప్ట్‌ను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాలో పవన్‌కు జోడీగా ప్రభాస్ 'ఫౌజీ' సినిమా హీరోయిన్ ఇమాన్వీ పేరు ప్రముఖంగా వినిపిస్తుండటం విశేషం. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించి మరో క్రేజీ అప్‌డేట్ ఏమిటంటే, ఇందులో పవన్ కళ్యాణ్‌కు తమ్ముడిగా ఒక యువ అగ్ర హీరో నటించే అవకాశం ఉందని, అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో సాగే పక్కా మాస్ మూవీగా ఇది ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. నిర్మాత రామ్ తాళ్లూరి దాదాపు రూ. 250 కోట్ల భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తన రాజకీయ బాధ్యతల నడుమ షూటింగ్‌లో పాల్గొనేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 2026 మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ పక్కా ప్లాన్ తో ఉన్నారు. ఇప్పటికే పవన్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 26, విడుదల కానుండగా, ఆ వెంటనే ఈ భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. ఇది మరో క్రేజీ సినిమాగా నిలుస్తుందని పవన్ అభిమానులు అభివర్ణిస్తున్నారు.

## ఓటీటీలోనూ దురంధర్ దూకుడు



ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్'. దాదాపు రెండు నెలలు థియేటర్లలో సందడి చేసి బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన ఈ చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన 'ధురంధర్'.. జనవరి 30న నెట్‌ఫ్లిక్స్ (ఔబ్గొ÷తిలీ) వేదికగా డిజిటల్ ప్రేక్షకుల ముందుకు అందుబాటులోకి వచ్చింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలిరోజు నుంచే వ్యూస్‌లో సత్తా చూపిస్తూ పలు రికార్డులను సొంతం చేసుకుంటోంది. పదిరోజుల్లో ఈ సినిమాకు దాదాపు 16 మిలియన్ల వ్యూస్ (15.9) వచ్చినట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. మొదటి మూడు రోజుల్లోనే 7.6మిలియన్ల వ్యూస్‌తో గ్లోబల్ టాప్-10 నాన్ ఇంగ్లీష్ ఫిల్మ్స్ జాబితాలో నెం.1 స్థానంలో నిలిచిన 'ధురంధర్'. ఫిబ్రవరి 2 నుంచి 8 వరకూ 8.2 మిలియన్ల వ్యూస్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఏకంగా 11 దేశాల్లో నం.1 స్థానంలో కొనసాగుతోంది. తొలిభాగం సూపర్ హిట్ కావడంతో చిత్రబృందం రెట్టింపు ఉత్సాహంతో రెండో పార్ట్‌ను విడుదల చేసేందుకు సిద్ధమైంది. మొదటి భాగానికి మించి ఇది విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందని నిర్మాత జ్యోతి దేశ్‌పాండే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అందుకే ఐదు భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. తొలి చిత్రానికి కొనసాగింపుగా 'ధురంధర్2' రెడీ అవుతోంది. మార్చి 19న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన టీజర్ పార్ట్2పై అందరినీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

## ఎంబిబిఎస్ పట్టా పుచ్చుకున్న శ్రీలీల



టాలీవుడ్ యంగ్ సెన్సేషన్ శ్రీలీల తన జీవితంలో ఒక అద్భుతమైన ఘట్టాన్ని పూర్తిచేసుకుంది. వెండితెరపై నటిగా అలరిస్తున్న ఆమె, ఇప్పుడు అధికారికంగా డాక్టర్ శ్రీలీలగా మారారు. తన మెడికల్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసిన శ్రీలీల తాజాగా కాన్వోకేషన్ వేడుకలో మెడిసిన్ పట్టాను అందుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు ఫొటోలు వైరల్‌గా మారాయి. నిజానికి శ్రీలీల తన తల్లి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వర్ణలత గారిని స్ఫూర్తిగా తీసుకుని మెడిసిన్ వైపు అడుగులు వేశారు. గత ఏడాది చేతినిండా సినిమాలతో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన లక్ష్యం కోసం చదువుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఒక్కోసారి రోజంతా షూటింగ్‌లతో బిజీగా ఉంటూనే, విరామ సమయంలో పుస్తకాలు చదువుతూ ఆమె పడ్డ శ్రమ ఇప్పుడు ఫలించింది. చిన్నతనంలో తన అమ్మమ్మ అనారోగ్యం పాలైనప్పుడు ఒక వైద్యురాలిగా సేవ చేయాలన్న తన కోరికను ఆమె నేడు నెరవేర్చుకున్నారు.

## పవన్ షూటింగ్ చూసేందుకు వెళ్లి లాఠీ దెబ్బలు తిన్నా

'పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కోసం ఒక ఘటనలో తాను కూడా లాఠీ దెబ్బలు తిన్నానని యంగ్ హీరో సంతోష్ శోభన్ తాజాగా వెల్లడించాడు. సంతోష్ శోభన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ' వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర సంఘటనను గుర్తుచేసుకున్నారు. పవన్ కళ్యాణ్‌ను ప్రత్యక్షంగా ఎక్కువసార్లు చూడలేదని, అయితే ఒకసారి 'అత్తారింటికి దారేది' సినిమా షూటింగ్ సమయంలో ఆయనను చూసేందుకు వెళ్లిన అనుభవాన్ని పంచుకున్నారు. సంతోష్ శోభన్ మాట్లాడుతూ.. 'ఆ సమయంలో పవన్ కళ్యాణ్ గారి క్రేజ్ చాలా ఎక్కువగా ఉండేది. షూటింగ్ అవుట్‌డోర్‌లో జరగడంతో భారీ సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకున్నారు. పరిస్థితి అదుపు తప్పుతుందని భావించిన పోలీసులు జనాన్ని నియంత్రించేందుకు ప్రయత్నించారు. ఆ క్రమంలో తోపులాటలు జరిగాయి. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అప్పుడు అక్కడున్న అభిమానులతో పాటు నాకు కూడా లాఠీ దెబ్బలు పడ్డాయి' అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంతోష్ శోభన్ నటించిన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా రిలీజ్‌కు ముందు ఈ వ్యాఖ్యలు చిత్రంపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.